www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -72 శుక్రవారం 26 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01


Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# నదుల అనుసంధానంతోనే దేశాభివృద్ధి



## తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

- రూ.51 కోట్లతో 33 కొత్త గేట్ల ఏర్పాటు
- మూడు రాష్ట్రాల సిఎంలు కలసి ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పాటిల్
- ఒకేవేదికపై డికె, చంద్రబాబు, రేవంత్



**బళ్లారి, జూన్ 25 (ప్రజావినికిడి):** కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మిగతాది 2లో...

## జల వివాదాలను పరిష్కరించుకుందాం

- పంచాయితీలు కాదు...పరిష్కారాలు ముఖ్యం
- తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి
- మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి
- కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి
- మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



## నీటిని పొదుపుగా వాడదాం..

- మూడు రాష్ట్రాల సీఎంల భేటీ చరిత్రాత్మకం: సీఎం చంద్రబాబు
- నదుల అనుసంధానమే దేశాభివృద్ధికి కీలకమన్న చంద్రబాబు
- ఎల్ నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడాలని సూచన
- దక్షిణాది రాష్ట్రాల భేటీ చరిత్రలో నిలిచిపోతుందన్న సీఎం



# వెనిజువెలా వణికింది



**32 మంది మృతి**

- 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూప్రకంపనలు
- నేలమట్టం అయిన భారీ భవనాలు..ఇళ్లు, భవన సముదాయాలు
- దాదాపు శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్

**కారకాస్, జూన్ 25(ప్రజావినికిడి):** వెనిజువెలాలో కేవలం నిమిషం తేడాలో రెండుసార్లు భారీ భూకంపం వణికించింది. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండుసార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. మిగతాది 2లో...

## రూ కోటి 25 లక్షల ఉచిత ప్రమాద బీమా

- ఉద్యోగులకు 'ప్రజా ప్రభుత్వం' బంపర్ ఆఫర్
- విమాన ప్రమాదమైతే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు రక్షణ
- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు
- దేశ చరిత్రలోనే తొలిసారి ..త్వరలోనే 'క్యాష్‌లెస్' హెల్త్ కార్డ్స్
- ఒకటో తేదీనే జీతాలు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



## గతాన్ని మరచి పోండి.. అలాంటి పొరపాట్లు జరగవు



- ఇకముందు మిమ్ములను బాగా చూసుకుంటా
- వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అంటూ..
- కార్యకర్తలకు కెటిఆర్ భరోసా

**వికారాబాద్, జూన్ 25 (ప్రజావినికిడి):** వచ్చే ఐదేళ్ల మన ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటిని బ్యాలెన్స్‌గా నడిపించే బాధ్యత నాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. 2028లో మీ అందరి దయతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయితరు.. అయిన తర్వాత నేను బాధ్యత తీసుకుంటా..అన్నారు. మీకు రావాల్సిన పదవులు.. జరుగాల్సిన లాభం. మిగతాది 2లో...

## వాణిజ్య ఎల్పీజీ సరఫరాపై ఆంక్షలు ఎత్తివేత


- బల్క్ ఎల్పీజీ సరఫరాలు 50% మేర పునరుద్ధరణ
- అమెరికా-ఇరాన్ ఒప్పందంతో మెరుగైన దిగుమతులు
- హోటళ్లు, పరిశ్రమలకు భారీ ఊరట
- దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి రోజుకు 40 వేల టన్నుల కంటే తగ్గదని హామీ

**జూన్ 25 (ప్రజావినికిడి):** పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సరఫరాపై విధించిన ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది. అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం, హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడంతో దిగుమతుల పరిస్థితి మెరుగుపడటమే ఈ నిర్ణయానికి కారణమని కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించింది.



## ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదు

- బకాయిలపై ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న
- ప్రైవేట్ యాజమాన్యాలకు స్వల్ప ఊరట




**హైదరాబాద్,జూన్ 25 (ప్రజావినికిడి):** తెలంగాణ హైకోర్టు లో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే విధించింది. మంగళవారం వరకు స్టే విధిస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ హైకోర్టు పలు వ్యాఖ్యలు చేసింది. 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదు. మీరు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల నుంచి యాజమాన్యాలు వసూలు చేయొద్దంటే మిగతాది 2లో...

## క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు



- పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు
- జూన్ 28లోగా లొకేషన్ల ఖరారు
- జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 25(ప్రజావినికిడి):** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మిగతాది 2లో...

## భారత్‌లో అమెజాన్ రూ.4లక్షల కోట్ల పెట్టుబడి

- ప్రధాని మోదీతో అమెజాన్ సీఈఓ భేటీ..
- 2026-30 మధ్య భారత్‌లో 48 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్న అమెజాన్
- ఏఐ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విస్తరణకు అదనంగా 13 బిలియన్ డాలర్ల కేటాయింపు
- ముంబై, హైదరాబాద్‌లలో డేటా సెంటర్ల సామర్థ్యం పెంపునకు ప్రణాళిక
- ఉద్యోగాల కల్పన, ఎగుమతుల ప్రోత్సాహానికి పెద్దపీట వేయనున్నట్లు ఆండీ జెస్సీ వెల్లడి

**జూన్ 25 (ప్రజావినికిడి):** ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్, భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీతో కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. 2026 నుంచి 2030 మధ్య కాలంలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక .మిగతా 5లో...



# నదుల అనుసంధానంతోనే దేశాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ.51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పీల్ వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, శివకుమార్ కలసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.




## జల వివాదాలను పరిష్కరించుకుందాం

**మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం,
పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## నీటిని పొదుపుగా వాడదాం..

**నదుల అనుసంధానమే దేశాభివృద్ధికి కీలకమన్న చంద్రబాబు**

కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకు 33 నూతన క్రస్ట్ గేట్లను ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఈ కార్యక్రమం అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చొరవతో ఏపీ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు ఒకేచోట కలవడం చారిత్రాత్మకమని అన్నారు. కేంద్రమంత్రి తన చొరవతో మూడు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలనే కాకుండా, నదులను కూడా అనుసంధానించారని ఆయన వ్యాఖ్యానించారు.

మూడు రాష్ట్రాల రైతులకు సాగునీటిని, ఈ ప్రాంత వాసులకు తాగునీటిని అందిస్తోన్న తుంగభద్ర డ్యామ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. 'తుంగా పానం, గంగా స్నానం' అనే సామెతను ప్రస్తావిస్తూ, తుంగ నది నీటి పవిత్రతను కొనియాడారు. 2024లో 19వ నంబర్ గేటు కొట్టుకుపోయినప్పుడు, నిపుణుడు కన్నయ్య నాయుడు సలహాతో స్టాప్‌లాక్ గేట్ అమర్చి నీటి వృధాను అరికట్టామని తెలిపారు. ఇప్పుడు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు సమష్టిగా పనిచేసి 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి, డ్యామ్‌ను పునరుద్ధరించి రైతుల ప్రయోజనాలను కాపాడామని వివరించారు.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 'వన్ నేషన్ వన్ గ్రిడ్', టెలికాం, రహదారుల నెట్‌వర్క్ వంటి కార్యక్రమాలతో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు అన్నారు. ఇదే స్ఫూర్తితో దేశంలో గంగా-కావేరి నదుల్ని అనుసంధానిస్తే భారతదేశం అప్రతిహతంగా ముందుకు సాగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో కెన్-బెత్వా ప్రాజెక్టు ద్వారా నదుల అనుసంధానం విజయవంతమైందని గుర్తుచేశారు. అదేవిధంగా గోదావరి-కావేరి నదులను అనుసంధానించడం ద్వారా కర్ణాటక, ఏపీ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ప్రయోజనాలు నెరవేరతాయని సూచించారు.

ఈ ఏడాది ఎల్ నినో కారణంగా తుంగభద్ర, ఆల్మట్టి జలాశయాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహాలు తగ్గిపోయాయని, అందుకే నీటిని చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు హెచ్చరించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకే నదుల అనుసంధానం కీలకమని ఆయన పునరుద్ఘాటించారు. ముందుగా రాష్ట్రాల పరిధిలో అంతర్గతంగా నదులను అనుసంధానించుకుని, ఆ తర్వాత అంతర్రాష్ట్ర నదుల అనుసంధానంపై దృష్టి పెట్టాలని సూచించారు. విజయనగర సామ్రాజ్యానికి, హంపీకి తుంగభద్ర నది సహజ రక్షణ కవచంగా నిలిచిందని, జోగులాంబ, హంపీ విరుపాక్ష ఆలయం, రాఘవేంద్ర మఠం వంటి ఎన్నో పుణ్యక్షేత్రాలు ఈ నదీ తీరానే వెలిశాయని చంద్రబాబు గుర్తుచేశారు. 'రాష్ట్రాలుగా మనం వేరైనా, దేశంగా మనం అంతా ఒక్కటే' అని పేర్కొంటూ, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి రైతుల ప్రయోజనాలపై చర్చించడం శుభపరిణామమని అన్నారు. ఈ సమావేశం దక్షిణాది రాష్ట్రాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, అందరం కలిసికట్టుగా రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

# వెనిజువెలా వణికింది

(మొదటి పేజీ తరువాయి)

ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది.

మృతుల సంఖ్య లక్ష వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. వెనెజువెలాను బుధవారం నాడు వరుస భూకంపాలు 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూకంపాలు సంభవించి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కరేబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమాన 21 కిలోమీటర్ల దూరంలో 7.2 తీవ్రతతో మొదటి భూకంపం వచ్చింది. అదే పట్టణానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో క్షణాల వ్యవధిలోనే 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 10 వేల నుంచి లక్ష మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. అలాగే వేల మంది ప్రజలు గాయపడి ఉండొచ్చని తెలిపింది. భూకంపాలతో అనేక భవనాలు నేలమట్టం కాగా, ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న అనేక వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. మొదటి భూకంపం వచ్చినప్పుడు ఒక్కసారిగా పెద్దపెద్ద భవనాలు కూలిపోవడం ప్రారంభమయ్యాయి. అనేక చిన్నచిన్న ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఏం జరుగుతుందో గ్రహించి, ప్రాణరక్షణ కోసం ప్రజలు పరిగెత్తే లోపే అంతకంటే ఎక్కువ తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దీంతో భారీ విధ్వంసం జరిగింది. కొన్ని భారీ భవనాలు కూలిపోగా, మరికొన్ని బిల్డింగులు ఊగిపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కూలిపోగా, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో తమ ప్రాణాలను, కుటుంబ సభ్యులను కాపాడు కునేందుకు స్థానికులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మరోవైపు వెనెజువెలాలోని సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు కూలిపోయింది. దీంతో విమానాశ్రయంలోని టెర్మినల్ మొత్తం దుమ్ముతో నిండిపోయింది. కొంతమంది ప్రయాణికులు తమ లగేజీ పట్టుకుని ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మరికొంతమంది లోపలే ఓ ఫుడ్ కౌంటర్ వద్ద ఆశ్రయం పొందారు. మొత్తం దుమ్ముతో నిండిపోతున్నా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అక్కడే ఉండిపోయారు. తీరప్రాంత నగరమైన లా గువైరాకు సంబంధించిన మరో వీడియో వెలుగులోకి వచ్చింది. వరుస భూకంపాలతో కూలిపోయిన భవనాలు, గాలిలోని దుమ్ము, నిర్మానుష్యంగా మారిన రహదారులు ఆ వీడియోలో కనిపించాయి. వెనెజువెలా రాజధాని కారకాస్‌లోనూ భారీ విధ్వంసం జరిగింది. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. స్థానికులు ప్రాణభయంతో కేకలు వేసిన దృశ్యాలు ఆవేదన కలిగిస్తున్నాయి. మరో వీడియోలో ఓ వ్యక్తి తన పెంపుడు కుక్కల ప్రాణాలు కాపాడిన దృశ్యాలు కనిపించాయి. కూలిపోయిన తమ ఇంటి నుంచి అతి కష్టం మీద కుటుంబ సభ్యులను కాపాడుకున్నాడు బాధితుడు. ఆ తర్వాత తన రెండు కుక్కలనూ ప్రాణాలతో బయటకు తీసుకువచ్చాడు. ఇలాంటి అనేక వీడియోలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కంటతడి పెట్టిస్తున్నాయి. మరోవైపు జంట భూకంపాల అనంతరం వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో కూడా ప్రజలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# గతాన్ని మరచి పోండి.. అలాంటి పొరపాట్లు జరగవు

(మొదటి పేజీ తరువాయి)

మీకు కోరుకునే గౌరవం వచ్చే విధంగా చేసే బాధ్యత నాది. గతం మరిచిపోండి.. చిన్నచిన్నపొరపాట్లు జరిగి ఉండొచ్చు. ఇక్కడ ఉద్యమంలో పనిచేసిన బిడ్డలు కూడా ఉన్నారు. వాళ్లకు కూడా అయ్యో మాకు జరుగాల్సిన న్యాయం జరుగలేదనే భావన ఉండొచ్చు. నేను వారందని ప్రార్థిస్తున్నానని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో లాగా చిన్నచిన్న పొరపాట్లు జరుగకుండా చూసుకుంటమని నేను మీకు మాటిస్తున్నానన్నారు. వాస్తవానికి మొత్తం ప్రభుత్వం మీద దృష్టి పెట్టినం.. పార్టీ మీద ఎక్కువ దృష్టి పెట్టలేదు. కొత్త రాష్ట్రం, కొత్త సంసారం కాబట్టి పునాది గట్టిగా పడాలి అని.. మన రాష్ట్రం నవ్వే వాళ్ళ ముందు జారిపడొద్దని.. మీకు పరిపాలన చేతనైతదా అన్నోళ్లను నోళ్లు మూయించాలే.. మంచిగా నడిపించాలని ఆలోచన చేసాం తప్ప వేరే ఆలోచన చేయలేదని అన్నారు. ఒక సైనికుడు శాంతి సమయంలో ఎంత చెమట చిందిస్తే, యుద్ధంలో అంత తక్కువ రక్తం కారుతుంది. మీ ఈ టైంలో పార్టీని బందబస్తుగా నిర్మాణం చేసుకుంటే రేపు ఎన్నికలు వచ్చినంక ఆగమాగమయ్యే బాధ తప్పుతది.. మీకు ఐడీ కార్డు వస్తది.. ఆ ఐడీ కార్డు రేపు మన ప్రభుత్వం వచ్చినంక జేబులో పెట్టుకొని పోతే ఆ ఆఫీసర్ అయినా పోలీసోడు అయినా కేసీఆర్ మనిషి వచ్చిండు పని చేయాలని మీకు గౌరవమిచ్చి పనిచేసే పరిస్థితి ఉంటది. మంచి ఐడీ కార్డు తయారుచేసి ప్రతీ కార్యకర్తకు ఇస్తం. మిమ్మల్ని రాబోయే 5 సంవత్సరాలు మాత్రం గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరుగకుండా ఉద్యమ కారులను కానీ, కార్యకర్తలను కానీ కడుపులో పెట్టుకొని చూసుకునే బాధ్యత తీసుకుంటానన్నారు.

## క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు పక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు పక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన్ ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి, డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదు

,(మొదటి పేజీ తరువాయి)

కళాశాలను వారు ఎలా నడుపుతారు? రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బ్జడెట్ కేటాయించారు?పెండింగ్ బకాయిలు ఎప్పటిలోపు చెల్లిస్తారు?' అని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వం తరపు న్యాయవాది స్పందిస్తూ ఆగస్ట్ 15లోపు బకాయిలు చెల్లిస్తామని బదులిచ్చారు. అలా జరిగితే తమ పిటిషన్లు కూడా వెనక్కి తీసుకుంటామని ప్రైవేట్ కళాశాలల తరపు న్యాయవాది చెప్పారు. ఇదే అంశంలో విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. విద్యార్థుల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అటు ప్రభుత్వం, ఇటు కళాశాలల యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారన్నారు. ఈ బకాయిలతో విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును కోరారు. మంగళవారం అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని ప్రభుత్వం తరపు న్యాయవాది చెప్పారు. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి ఉన్నత న్యాయస్థానం వాయిదా వేసింది.

# రూ కోటి 25 లక్షల ఉచిత ప్రమాద బీమా

**ఉద్యోగులకు 'ప్రజా ప్రభుత్వం' బంపర్ ఆఫర్**

**విమాన ప్రమాదమైతే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు రక్షణ**

**హైదరాబాద్, జూన్ 25(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి విక్రమార్క వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ. 10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు. కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాకుండా.. నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ




కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళ్లు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ (ఈఎంఐలు) కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది. మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి గారు 'ఉద్యోగుల హక్కులను కాపాడాలి' అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు. ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డ్‌ల సమస్యకు ప్రజా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక ప్రత్యేక 'ట్రస్ట్' ద్వారా ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో 'క్యాష్‌లెస్' (నగదు రహిత) వైద్య సేవలు అందించేలా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, దీనివల్ల ఆరోగ్య భద్రత మరింత మెరుగవుతుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10 లక్షల ఉచిత వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రేషన్ కార్డులపై సన్నబియ్యం, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ ద్వారా రూ. 1,11,116 ఆర్థిక సాయం వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ సంక్షేమ ఫలాలను చిట్టచివరి లబ్ధిదారునికి చేర్చడంలో డెలివరీ మెకానిజంగా ఉద్యోగులే కీలక పాత్ర పోషిస్తున్నారని, అందుకే వారి కుటుంబ సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం తన బాధ్యతగా తీసుకుందని కొనియాడారు. ఈ బీమా పథకం నమోదుకు ముందుకు వచ్చిన బ్యాంకర్లకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సుదూర విజన్‌కు అనుగుణంగా, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగులు, బ్యాంకర్లు, ప్రభుత్వం సమష్టిగా, చేయి చేయి కలిపి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఎ రేవంత్ రెడ ÷-డి, మంత్రులు పొన్నంప్రభాకర్, పొంగులేటి, అజారుద్దీన్, వివేక, సిఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# వీరులకు వందనం.. గుర్తించిన ఎమ్మెల్యేకు అభివందనం..

**షాద్ నగర్ తెలంగాణ ఉద్యమకారుల కితాబు..**

**అమరు వీరుల స్తూపం ఏర్పాటుపై తొలి, మలి దశ ఉద్యమకారుల ప్రశంసలు..**

**తెలంగాణ అమర వీరుల స్థూపాన్ని పరిశీలించిన ఉద్యమకారులు..**

**పక్కనే ధ్వంసమైన తెలుగు తల్లి విగ్రహం స్థానంలో**

**"తెలంగాణ తల్లి"ని ఏర్పాటు చేయండి..**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు "తొలి మలిదశ " ఉద్యమకారుల వినతి..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తమ ప్రాణాలర్పించిన వీరులకు వందనం.. అమరుల త్యాగాలను గుర్తించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అభివందనం అంటూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారులు ప్రశంసలు కురిపించారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆర్థిక సహకారం చొరవతో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని స్థానిక తెలంగాణ ఉద్యమకారులు సందర్శించారు. స్థూపం నిర్మాణ పనులపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మాణం అవుతున్న అమరుల స్థూపాన్ని తొలిదశ ఉద్యమకారులు నాగిళ్ళ గోపాల్ గుప్తా,యాదవా చారి,అదేవిధంగా మలిదశ ఉద్యమకారులు పి.వెంకట్రాంరెడ్డి, పినపాక ప్రభాకర్, టీజీ శ్రీనివాస్, జర్నలిస్ట్ ఖాజా పాషా కెపి,టీజీ శ్రీనివాస్,కౌన్సిలర్ దిలీప్ కుమార్, బిజెపి నేత వంశీ కృష్ణ,కాంగ్రెస్ నేత జాంగారి రవి, మాదసి కురువ సంఘం అధ్యక్షులు సింధం విటలయ్య, జర్నలిస్ట్ రాఘవేందర్ గౌడ్ తదితరులు ఎమ్మెల్యే శంకర్ సహకారంతో నిర్మిస్తున్న అమరవీరుల స్థూపాన్ని పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు.

### నిజమైన ఉద్యమకారులను గుర్తించండి - నాగిళ్ల గోపాల్ గుప్తా

షాద్ నగర్ లో తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని నిర్మిస్తున్న స్థానిక ఎమ్మెల్యే పీర్లపల్లి శంకర్ సేవలు ప్రశంసనీయమని ఎంతో గొప్ప ఆలోచనతో చరిత్ర మరచిపోని గొప్ప పనిని చేపట్టారని తొలి దశ తెలంగాణ ఉద్యమకారులు నాగిళ్ల గోపాల్ గుప్తా కొనియాడారు. ఆనాడు ఉద్యమంలో అనేక వెయ్య ప్రయాసలకు కూర్చిన సంఘటనలను ఆయన కళ్ళకు కట్టినట్లు మీడియాకు వివరించారు.జలు జీవితం అనుభవించిన తీరు ఆర్థిక నష్టం త్రైత అంశాలను ఆయన వివరించారు. ఆనాటి నుండి నీటి వరకు జరిగిన తెలంగాణ ఉద్యమంలో అసలైన వారిని పక్కకు తప్పించి కొందరు తామే అసలైన తెలంగాణ ఉద్యమకారులుగా చలామణి అవుతుండడం బాధాకరమని నాగిళ్ళ గోపాల్ గుప్త ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిజమైన ఉద్యమకారులను గుర్తించి పార్టీలకు రాజకీయాలకు అతీతంగా అందరికీ గుర్తింపు ఇవ్వాలని ఆయన సూచించారు.

### ఎమ్మెల్యే శంకర్ అభినందనీయుడు -యాదవా చారి

తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని రాష్ట్రం ఏర్పడిన 12 ఏళ్ల తర్వాత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఆయన ఆలోచనతో ఏర్పాటు చేయడం అభినందనీయమని తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు యాదవా చారి ప్రశంసించారు. ఎంతో గొప్ప ఆశయంతో నిర్మించిన అమరవీరుల స్తూపం ఉద్యమకారుల గుండెల్లో పెట్టుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆర్థికంగా ముందుకు వచ్చి మంచి ఆలోచనతో స్థూపాన్ని ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని ఆయన కోరారు.

### కొత్త సంఘాలు పుట్టుకొస్తున్నాయి.. -ఉద్యమకారుడు పినపాక..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు పింఛన్లు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పడంతో తెలంగాణ ఉద్యమకారుల పేరిట కొత్త సంఘాలు పుట్టుక రావడం శోచనీయమని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు మలిదశ ఉద్యమకారుడు పినపాక ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే శంకర్ ఏర్పాటుచేసిన అమరవీరుల స్తూపాన్ని ఆయన సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు.ఎవరి వల్ల కానీ ఒక మంచి పని ఎమ్మెల్యే శంకర్ వల్ల జరిగిందని ఇది ఉద్యమకారులకే గర్వకారణం అని అన్నారు.మంచి చేస్తే మంచి అని చెడు చేస్తే ప్రశ్నించాలని తమ అభిమతం అని ఎమ్మెల్యే చేస్తున్న ఈ పనికి ఉద్యమకారులంతా రుణపడి ఉంటామని అన్నారు.అదే సమయంలో షాద్ నగర్ లో ఉద్యమకారుల విషయంలో ఏం జరుగుతుందో ఎమ్మెల్యే గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎవరు పనిచేశారు ఎవరు పనిచేయలేదు ఎవరి ప్రస్థానం ఏమిటో గ్రహించాలని అన్నారు. ఉద్యమాలు ఎవరు చేశారో ఎవరు చేయలేదు అనే సందిగ్ధం కూడా ఇక్కడ ఏర్పడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ రోజుల్లో



కోట్లాదిమంది ఉద్యమాలు చేశారని అయితే ఇందులో ముఖ్య భూమిక పోషించిన వారు ఎవరు ఎంతమంది వారి ప్రాముఖ్యత ఏమిటో గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు తల్లి విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లిని ఎమ్మెల్యే ఏర్పాటు చేయాలని వారు కోరారు.

### ఉద్యమకారులే ప్రజాప్రతినిధులు అయినా ఫలితం లేదు-పి.వెంకటరాంరెడ్డి

షాద్ నగర్ లో ఉద్యమకారులే ఎమ్మెల్యే అయిన ఇక్కడ స్థానిక ఉద్యమకారులకు ఎలాంటి ఫలితం లేదని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి వెంకట్రాంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని ఎమ్మెల్యే శంకర్ ఎంతో చొరవతో ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రతి తెలంగాణ ఉద్యమకారుడు దీనికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక ఉద్యమకారులే ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలు అయినప్పటికీ ఉద్యమకారులను పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. షాద్ నగర్ లో కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే అయ్యాక మొదట ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని పునర్నిర్మానం చేపట్టి అందంగా తీర్చిదిద్దారని,ఆ తర్వాత తన సొంత ఖర్చులతోనే మరోసారి ఉద్యమకారుల మనోభావాలను అర్థం చేసుకొని అమరుల స్తూపాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని వెంకటరామిరెడ్డి తెలిపారు.

### ఎమ్మెల్యే కృషి అభినందనీయం -ఉద్యమకారుడు కౌన్సిలర్ దిలీప్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి అనిర్వచనీయమని తెలంగాణ ఉద్యమకారుల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధి ఎంతో గొప్పదని తెలంగాణ ఉద్యమకారులు స్థానిక కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ స్పష్టం చేశారు. అమరుల స్థూపాన్ని చూసి ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉద్యమకారులను నిజమైన వారిని గుర్తించి వారికి ప్రభుత్వం తరఫున సహకారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై తమకు నమ్మకం ఉందని ఉద్యమకారులకు ఆయన అండగా భరోసాగా ఉంటారన్న ధీమా వ్యక్తం చేశారు. మలిదశ ఉద్యమకారులు తమకు ఉద్యమ బాట చూపిస్తే మలిదశ ఉద్యమకారులు ఎంతో ఆందోళనలు చేపట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని ఇది చరిత్ర ఎన్నటికీ మర్చిపోదని ఆయన కొనియాడారు.

### ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను స్వాగతిస్తున్నాం- టీజీ శ్రీనివాస్

గత రెండు సంవత్సరాలుగా ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను చేపట్టిన ప్రభుత్వ ప్రయత్నాన్ని ఉద్యమకారుడు స్వాగతిస్తున్నారని ఉద్యమ నేత టీజీ శ్రీనివాస్ తెలిపారు.షాద్ నగర్ లో తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే శంకర్ ముందుకు రావడం నిజంగా అభినందనీయమని పేర్కొన్నారు.



### నిజమైన ఉద్యమకారులను గుర్తించండి -బిజెపి నేత వంశీకృష్ణ

షాద్ నగర్ లో నిజమైన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వారికి పూర్తి సహకారం అందించాల్సిన అవసరం ఉందని బిజెపి యువ నాయకుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. రాజకీయాల్లో కతీతంగా ఎమ్మెల్యే శంకర్ అమరవీరుల స్థూపాన్ని నిర్మించి తన ఔన్నత్యాన్ని చాటారని వంశీకృష్ణ అన్నారు. ఉద్యమకారుల తరపున ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ఎమ్మెల్యే శంకర్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయండి..

అమరుల స్తూపం పక్కనే ధ్వంసమైన తెలుగు తల్లి విగ్రహం స్థానంలో వెంటనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు తొలిదశ మలిదశ ఉద్యమకారులు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారుల మనోభావాలను ఎంతో చక్కగా అర్థం చేసుకుని ఆకలింపు చేసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరో అడుగు ముందుకు వేసి పక్కనే ఉన్న ధ్వంసమైన విగ్రహం స్థానంలో వెంటనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.ఈ సందర్భంగా స్థానిక ఉద్యమకారులు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక పై సమావేశం అయ్యారు. త్వరలోనే అసలైన ఉద్యమకారులతో చర్చించి సరికొత్త నిర్ణయంతో ముందుకు వస్తామని వారు ప్రకటించారు

# ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యం

**నాగోల్,(ప్రజావినికిడి):**


ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ కనిపించకుండా పోయిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం..తట్టి అన్నారం జి.వి.ఆర్.కాలనీకి చెందిన మహమ్మద్ షరీఫ్ ఖాన్ షా తన భార్య షరీఫ్ మిరాజ్ అలియాస్ మెహర్నిషా (49) కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు.ఈ నెల 16న మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. బంధువులు, స్నేహితులు,బస్ స్టాండ్లు,రైల్వే స్టేషన్లలో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మహిళ ఆచూకీ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు. ఆమె గురించి సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్ లేదా నాగోల్ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 8712662751కు సమాచారం అందించాలని కోరారు

## మహిళ బిఆర్ఎస్ నాయకురాలు శైలజ పై మైనంపల్లి హనుమంతరావు అనుచరులు తీవ్ర వ్యాఖ్యలను ఖండిస్తూ.. నాగోల్ పిఎస్ లో ఫిర్యాదు..







**నాగోల్,(ప్రజావినికిడి):**ఎల్బీనగర్ నియోజకవర్గ సీనియర్ బీఆర్ఎస్ మహిళా నాయకురాలు శ్రీమతి శైలజ పై మైనంపల్లి హనుమంతరావు అనుచరులు చేసిన తీవ్ర, అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం రోజు ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు నాగోల్ పోలీస్ స్టేషన్ నందు సర్కిల్ ఇన్స్పెక్టర్ మక్బూల్ జానీకి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళా నాయకుల పట్ల అవమానకరంగా, అసభ్యకరంగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని పేర్కొన్నారు.మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,బాధ్యులైన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు.ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని,మహిళల పట్ల గౌరవం అదేవిదంగా భద్రతను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు,సూరజ్ యస్దాని,రమాదేవి,విజయగౌడ్,దేవి గౌడ్,పార్వతి,కల్పన,మమత,నిర్మల,పద్మ, విజయలక్ష్మి,సరళ,వరలక్ష్మి, నాగమణి, అనురాధ,వీణ,సురేఖ పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# షాద్ నగర్ లో మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది..

**మిస్సింగ్ కేసు నుంచి మర్డర్ మిస్టరీగా మారిన హసన్ ఘటన**

**పొదల్లో యువకుడి మృతదేహం లభ్యం**

**వడ్ల వ్యాపార లావాదేవీల వివాదమే హత్యకు దారితీసింది..?**

**ఇద్దరు స్నేహితులపై అనుమానాలు**

**హసన్ హత్య కేసులో ఇద్దరు స్నేహితుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు**

**చివరిసారిగా షేర్ చేసిన లొకేషన్‌లోనే మృతదేహం గుర్తింపు**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
నాగర్‌కర్నూల్ జిల్లా మంగనూరు గ్రామానికి చెందిన ఎం.డి.హసన్ (36) అదృశ్యమైన కేసు విషాదాంతమైంది. మూడు రోజులుగా కనిపించకుండా పోయిన హసన్ మృతదేహం గురువారం కాశిరెడ్డిగూడ శివారులోని ట్రూ ల్యాండ్ మార్క్ వెంచర్‌లో పొదల మధ్య లభ్యమైంది.
హసన్ కనిపించకుండా పోయినట్లు అతని సోదరుడు ఎం.డి. హాజీ ఈ నెల 23న షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదు ప్రకారం, జూన్ 22న హసన్ తన స్నేహితులు పనుగంటి అరవింద్,వీరకారి శివాజీలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు.అదే రోజు సాయంత్రం తన భార్యతో చివరిసారిగా ఫోన్‌లో మాట్లాడి షాద్‌నగర్ టోల్‌గేట్ దాటినట్లు తెలిపాడు. అనంతరం బుర్గుల ప్రాంతంలోని ట్రూ ల్యాండ్ మార్క్ వెంచర్ సమీప లొకేషన్‌ను మొబైల్ ద్వారా షేర్ చేసిన తర్వాత అతని రెండు ఫోన్లు స్విచ్ ఆఫ్ అయ్యాయి. పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా, హసన్ ప్రయాణించిన ఎక్స్‌ఎల్6 కారు (టీఎస్31కే4790) జూన్ 22న సాయంత్రం 7:40 గంటలకు బుర్గుల ప్రాంతంలోని లొకేషన్ వైపు వెళ్లినట్లు, అనంతరం రాత్రి 9:40 గంటలకు అక్కడి నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చి జడ్చర్ల వైపు వెళ్లినట్లు గుర్తించారు.ఈ నేపథ్యంలో గురువారం ఉదయం హసన్ బంధువులు, స్థానికులు అతను పంపిన చివరి లొకేషన్ పరిసరాల్లో గాలింపు చేపట్టగా కాశిరెడ్డిగూడ శివారులోని ట్రూ ల్యాండ్ మార్క్ వెంచర్‌లో పొదల మధ్య మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే షాద్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్,డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించారు.
మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, వడ్ల వ్యాపార లావాదేవీలకు సంబంధించిన ఆర్థిక వివాదాల నేపథ్యంలో హసన్ స్నేహితులైన అరవింద్, శివాజీలు అతనితో గొడవపడి గుర్తుతెలియని ఆయుధంతో తలకు గాయపరిచి హత్య చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.ప్రస్తుతం పోలీసులు మిస్సింగ్ కేసును అనుమానాస్పద హత్య కోణంలో విచారిస్తూ సంబంధిత చట్టపరమైన సెక్షన్లు జోడించి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో అనుమానితులుగా భావిస్తున్న అరవింద్, శివాజీలు పరారీలో ఉన్నట్లు సమాచారం. వారిని గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి..

# కీర్తిశేషులు జక్కుల నాగరాజుకు ఘన నివాళి

**ఆర్టీసీ ఉద్యోగిగా అందించిన సేవలు చిరస్మరణీయం**

**షాద్‌నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు**

**నివాళులర్పించిన జర్నలిస్టు కేపీ..**


**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన కీర్తిశేషులు జక్కుల నాగరాజు సేవలు చిరస్మరణీయమని షాద్‌నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం నాయకులు కొనియాడారు. జక్కుల నాగరాజు దశదినకర్మ కార్యక్రమం సందర్భంగా పలువురు ప్రముఖులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా షాద్‌నగర్ తాలూకా ముదిరాజ్



సంఘం గౌరవ అధ్యక్షులు అందే పైలయ్య ముదిరాజ్ మాట్లాడుతూ, నాగరాజు తన విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు.ఆయన మరణం ముదిరాజ్ సమాజానికి, స్నేహితులకు, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో షాద్ నగర్ తాలూక ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షులు అందే పైలయ్య ముదిరాజ్ అంచ రాములు ముదిరాజ్ విద్యాసాగర్ ముదిరాజ్ కానుగు అంతయ్య ముదిరాజ్ దినేష్ సాగర్ ముదిరాజ్ ర్యఖల రవి ముదిరాజ్ శ్రీనివాస్ అడ్వకేట్ కుడుముల బాల్ రాజ్ ముదిరాజ్ తంగేళ్లపల్లి శంకర్ ముదిరాజ్ మహిళా అధ్యక్షురాలు జూలపల్లి అనసూయమ్మ ముదిరాజ్ మదన్మోహన్ అడ్వకేట్ గడ్డమీది రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొని నాగరాజు చిత్రపటానికి నివాళులర్పించారు.అనంతరం నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే స్థానిక సీనియర్ జర్నలిస్టు కెపి.తో పాటు పలువురు ప్రముఖులు కూడా కార్యక్రమానికి హాజరై కీర్తిశేషులు జక్కుల నాగరాజుకు ఘన నివాళులు అర్పించారు.

# ప్రముఖ న్యాయవాది కంచి రాజగోపాల్ గృహ ప్రవేశ మహోత్సవం

### పలువురు ప్రముఖులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తల హాజరు



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్‌నగర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది కంచి రాజగోపాల్ నూతన గృహ ప్రవేశ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ, సామాజిక, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని రాజగోపాల్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు బక్కని నరసింహులు,వై. అంజయ్య యాదవ్,మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్,మాజీ ఎంపీపీ ప్రకాష్ గౌడ్,మాజీ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, సీనియర్ జర్నలిస్టు కేపీ, యువ నాయకుడు మధు,హెల్త్ డెడికేటర్ శ్రీనివాస్, కౌన్సిలర్ సుధీర్, సీనియర్ నాయకులు కట్టెల వేణు,అన్వర్ సెట్ తదితరులు హాజరై నూతన గృహాన్ని సందర్శించి గృహ యజమానులను అభినందించారు.అలాగే షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన పలువురు న్యాయవాదులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా అతిథులకు ప్రత్యేకంగా ఆతిథ్యం ఏర్పాటు చేశారు.గృహ ప్రవేశ వేడుక ఆత్మీయ వాతావరణంలో సాగగా,హాజరైన వారందరికీ కంచి రాజగోపాల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకం

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఎమ్మెల్యే శంకర్ శ్రేణులకు దిశానిర్దేశం**

**ఎస్ఐఆర్ విజయవంతానికి మండలాల వారీగా కాంగ్రెస్ ఇన్‌చార్జీల నియామకం..**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో నూతన కమిటీ ప్రకటన..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు మండలాల వారీగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలను నియమిస్తూ నూతన కమిటీని ప్రకటించారు.

సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభమైన నేపథ్యంలో, షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించి, అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్న ఆయన,మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. కొందరు నాయకులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, కార్యక్రమం పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించే కార్యక్రమాల నిర్వహణలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ,బీఆర్ఎస్ కంటే మెరుగ్గా పనిచేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మండలాలు, పట్టణాల వారీగా ఎస్ఐఆర్ కార్యక్రమ పర్యవేక్షణ కోసం క్రింది ఇన్‌చార్జీలను నియమించారు.

**నూతన ఎస్ఐఆర్ ఇన్‌చార్జీల కమిటీ**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కోసం షాద్ నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు రెండు మున్సిపాలిటీలకు కమిటీలను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. కొత్తూరు మండలానికి వీరేశం,చెంది తిరుపతిరెడ్డి, చిట్టెం దామోదర్ రెడ్డి,నందిగామ మండలం కోసం శ్రీను నాయక్, కృష్ణారెడ్డి,కేశంపేట మండలానికి ఇబ్రహీం,శ్రీకాంత్ రెడ్డి,ఫరూక్ నగర్ మండలం జితేందర్ రెడ్డి, కరుణాకర్,జంగ నరసింహులు, కొందుర్గు మండలానికి మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, చలివేంద్రం పల్లి రాజు,జిల్లెడ చౌదరి గూడెం మండలానికి చాలా మాజీ జెడ్పిటిసి తండ్ర విశాలా శ్రావణ్ రెడ్డి,మాజీ ఎంపీపి శివ శంకర్ గౌడ్,షాద్ నగర్ మున్సిపాలిటీకి సిద్ధార్థ,శివారెడ్డి, విశాల శ్రవణ్ రెడ్డి, సురేష్ రెడ్డి,శ్రీధర్ రెడ్డి,శివ,భాస్కర్, అన్వర్,అంబటి ప్రభాకర్,జంగారి రవి,కొత్తూరు మున్సిపాలిటీకి వెంకటరామిరెడ్డి, నర్సప్పగూడ కృష్ణ, శివశంకర్ గౌడ్, కంసాన్పల్లి తుపాకుల శేఖర్ తదితరులను నియమించారు. నియమితులైన ఇన్‌చార్జీలు ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# .ఎస్ఎన్ఆర్ ఇన్ఫ్రా అండ్ ల్యాండ్ సర్వే కార్యాలయ ప్రారంభోత్సవం

### పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్ నగర్ పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో సింగారం నర్సింగ్ రావు ఏర్పాటు చేసిన ఎస్ఎన్ఆర్ ఇన్ఫ్రా అండ్ ల్యాండ్ సర్వే నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించి సంస్థ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మాట్లాడుతూ,ఎస్ఎన్ఆర్ ఇన్ఫ్రా అండ్ ల్యాండ్ సర్వే సంస్థ భూసర్వే,మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగాల్లో నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఖచ్చితమైన సర్వే సేవలు అందించడం ద్వారా సంస్థ మరింత అభివృద్ధి చెందాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ యాజమాన్యం హాజీపల్లి సర్పంచ్ కుమార్,మాజీ కౌన్సిలర్లు చింటూ ప్రతాప్ రెడ్డి,జూపల్లి శంకర్ యువనాయకులు నవీన్,జయంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి

### షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి - జాతీయ టీకా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
జూన్ 28న నిర్వహించనున్న జాతీయ టీకాకరణ దినోత్సవం (పల్స్ పోలియో) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన డాక్టర్ విజయలక్ష్మి,0 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. భారతదేశం పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ, భవిష్యత్తులో వైరస్ పునరాగమనం జరగకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. షాద్‌నగర్ డివిజన్ పరిధిలో సుమారు 36 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు ప్రత్యేక బూత్‌లు, ట్రాన్సిట్ పాయింట్లు, మొబైల్ బృందాలు, పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బస్ స్టేషన్లు,రైల్వే స్టేషన్లు తదితర రద్దీ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పోలియో బూత్‌లకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని, ఇప్పటికే సాధారణ టీకాలు తీసుకున్న చిన్నారులకు కూడా పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు.

ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీకాంత్, ఎంఈఓ మనోహర్,గ్రామ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బంది,చించోడ్ వైద్యాధికారి డాక్టర్ శ్రావంతి,హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సామూహిక ఉపనయనాలు

### పాల్గొన్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి





**ఎల్బీనగర్,జూన్ 26,(ప్రజావినికిడి):**ఎల్బీనగర్ లోని శ్రీ వైష్ణవ సదన్ లో ఎస్వీఎస్ ట్రస్ట్ శ్రీ వైష్ణవ సేవా రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఉచిత సాముహిక ఉపనయన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సుమారు 50 మంది విద్యార్థులకు ఉచిత ఉపనయనాన్ని చేశారు.రామానుజ జీయర్ స్వామి ఉపనయన విధానాన్ని వివరించారు.కార్యక్రమాలలో ఉపనయన కార్యక్రమం చాలా విశిష్టమైనది జీయర్ స్వామి అన్నారు.సనాతన ధర్మ పరిరక్షణ కొరకు యువకులందరు పాటుపడాలని సూచించారు.వేదాన్ని పాటించాలంటే ఉపనయన సంస్కారం ఉండాలన్నారు.ఉపనయనం వల్ల మనిషి ఉత్సాహవంతుడు శక్తివంతుడు,తేజోవంతుడై,ఆరోగ్య వంతుడై మానసిక స్థితి మెరుగవ్వడం జరుగుతుందన్నారు. ఉపనయనం ధరించిన వాళ్ళు ప్రతిరోజు సూర్యనామస్కారం సంధ్యావందనం, చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ ట్రస్ట్ చైర్మన్ మాడగిరాచార్యులు,ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ చార్యులు, శ్రీ వైష్ణవ సేవా రాష్ట్ర సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్,ప్రధాన కార్యదర్శి పీచర కృష్ణమాచార్యులు, కన్వీనర్ పొడి చేటి రామకృష్ణ , ట్రస్టు సభ్యులు శ్రీ శఠగోపచార్య మాధవచార్య సంఘ నాయకులు వరదాచార్యులు, నరేంద్రాచార్యులు, యాదగిరి చార్యులు,శశీ కిరణ్, జగన్నాథాచార్య, లక్ష్మనాచార్య,వాద్యాలు, మహిళా విభాగం అధ్యక్షురాలు ప్యారక అరణ,గీత, హైదరాబాద్ మహనగర కార్యవర్గసభ్యులు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.


# తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన మధుయాష్కీ గౌడ్



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**గురువారం రోజు తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్,మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తో కలిసి పాశం అశోక్ గౌడ్ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ కు శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సత్కరించారు.

# శ్రీ మహేశ్వరి మహిళా మండల్ దిల్సుఖ్నగర్ ఆధ్వర్యంలో నిర్జల ఏకాదశి సందర్భంగా రత్న పంపిణీ





**కొత్తపేట,(ప్రజావినికిడి):**శ్రీ మహేశ్వరి సమాజ్ దిల్సుఖ్నగర్ శ్రీ మహేశ్వరి మహిళా మండల్ దిల్సుఖ్నగర్ ఆధ్వర్యంలో నిర్జల ఏకాదశి సందర్భంగా కొత్తపేట శ్రీ భవాని అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో రస్నా పానీయాలు పంపిణీ చేశారు. భారీ ఎత్తున ప్రజలు రస్న సేవించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మౌనిక సోమాని మంత్రి పద్మ మాలని నీ వర్తమానం అధ్యక్షు ప్రీతి సారడ గో అధ్యక్ష సంతోష్ సరడా సంఘటన్ మంత్రి మిలన్ లకోటియ ఉపాధ్యక్షులు రాఖీ బజాజ్ శోభ బజాజ్ సహ మంత్రాన్ని శశికళ హేడ,సోనియా సారడ ప్రచార మంత్రి ఉచిత ఇనాని ఆశి ముంగడ సంస్కృతి మంత్రాన్ని భవిత పోప్లియా,నీలిమ చండక్ కార్య కర్ని సదస్సు సరిత ఆసవ అనురాధ మాందాన సరిత లోయ సీమా బజాజ్ సిఏ శీతల్ బాంగడ్ ప్రమీలా సోమాని సోనల్ సోమని పుష్పాయి నాని కరుణా సోమనిసుమన్ మందన మేఘాల లాడ్డ నీతో మరద కవిత చడాక్ స్థాయి అమంత్రి సదస్సు తారా సోమని మమతా తాపిడియా రేణుక పోఫీలియా..విశేష్ ఆమంత్రి సదస్సు శృతి మరద..శ్రీ మహేశ్వరి సమా దిల్సుఖ్నగర్ కే సంరక్షక్ గోపాల్ సోమని. అధ్యక్షుడు గంశం బజాజ్.మంత్రి అవతార్ల ఓటి.నీ వర్తమాన అధ్యక్షుడు హనుమాన్ దాసి సోమన్.న్యూ వర్తమానం మంత్రి శివకుమార్ లకోటియ. కార్యకారిని సదస్సు మహేష్ మాలాని ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# రూ.3.12 కోట్లతో మూడు షెడ్ల నిర్మాణం

**షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" - వ్యవసాయ మార్కెట్ యార్డులో షెడ్లకు శంకుస్థాపన**

**గత పాలకులు మార్కెట్ యార్డ్ నిధులను తరలించకుపోయారు - ఈ ప్రాంత నిధులు తిరిగి ఇవ్వకుండా జీవో తెచ్చారు**

**పంటల కొనుగోలుపై అవగాహన లేని సన్నాసుల విమర్శలు పట్టించుకొం**

**మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి,వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ తదితర పాలకమండలి సభ్యుల హాజరు**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ నియోజకవర్గంలో రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి తమ ముఖ్య లక్ష్యమని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 3.12 కోట్లతో మూడు రైతు ప్రయోజన షెడ్లను నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు.మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి,వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అందరూ హాజరయ్యారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు సీనియర్ నాయకులు రైతులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.
శంకుస్థాపన పూజాది కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడారు. మూడు కోట్ల 12 లక్షల రూపాయలతో మూడు షెడ్లను ప్రజల ప్రయోజనార్థం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.గత పాలకులు ఇంత పెద్ద మార్కెట్ యార్డును అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశారని పైగా కోట్లాది రూపాయలను ఈ మార్కెట్ నుండి సిద్దిపేటకు తరలించారని ఆందోళన వ్యక్తం చేశారు.మార్కెట్ యార్డును అభివృద్ధి చేయలేని చేతకాని దద్దమ్మలు ఈ పని చేశారని అసెంబ్లీలో ఈ విషయంపై ప్రస్తావిస్తే మళ్లీ తిరిగి ఇవ్వకుండా జీవో ప్రకారం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తమ ప్రాంత నిధులను ఇతర ప్రాంతానికి తరలిస్తుంటే పట్టించుకోని పాలకులను ఏమనాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు.ఇక పంటల కొనుగోలుపై అవగాహన లేని రాజకీయ సన్నాసులు కొందరు ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేయడం వారి అవివేకానికి నిదర్శనం అని ఎమ్మెల్యే అన్నారు. ఇటీవల మార్కెట్ యార్డులో రాజకీయ ప్రయోజనాల కోసం కట్టుకథలు కల్పించి ప్రచారం చేసుకున్నారని అన్నారు.పంట ధరను నిర్ణయించేది కేంద్ర ప్రభుత్వం అని కొనుగోలు చేసేది కేంద్ర ప్రభుత్వం అని కేవలం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ చేస్తుందని ఈ మాత్రం ఇంకిత జ్ఞానం లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు.

### మార్కెట్ అభివృద్ధికి కృషి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి

షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతు ప్రయోజన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు కోట్ల 12 లక్షలతో మూడు షెడ్లను మూడు నెలల కాలంలో నిర్మించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా మరో 32 లక్షలతో సిసి రోడ్లు కూడా త్వరలో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామని వారు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో రైతులకు ఎలాంటి కష్టాలు ఎదురు కాకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామని సులోచన కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, డిఈఈ విష్ణువర్ధన్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్,మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణ రెడ్డి వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, 5వార్డు కౌన్సిలర్ శిరీష అనిల్ కుమార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్,భరత్ లోహోటీ,నవీన్,
రవి నాయక్, బాలశివరెడ్డి,పి నర్సింలు,వెంకట నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి, కక్కునూరు సందీప్,సురేష్ గౌడ్,కమిషన్ ఏజెంట్లు ప్రకాష్ గుప్తా,వెంకట సాయిశ్వర్ రెడ్డి, పందెం చిన్నారెడ్డి, కొట్రరాజు, మల్లప్ప, పెంద్యాల జగదీశ్వర్, గుడుపల్లి తీనాథ్, పెంటయ్య, వెంకటేష్ గుప్తా, సంజీవయ్య, సందీప్ గుప్తా, నేతలు బాలరాజ్ గౌడ్,రాయికల్ శ్రీనివాస్ కుమారస్వామి గౌడ్,చంద్రశేఖర్ శేఖర్ రెడ్డి,రమేష్, రఘు నాయక్,ఇబ్రహీం, మహమూద్, భాస్కర్ గౌడ్, దామోదర్ రెడ్డి, కొమ్ము కృష్ణ,శ్రీధర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి,సురేష్ రెడ్డి,గంగ మౌని సత్తయ్య అన్వర్, తుపాకుల శేఖర్, మహేందర్, సీతారాం సుదర్శన్, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## భారత్-కొరియా సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ రంగాల్లో సహకారం విస్తరణ




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి) :** విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జయశంకర్ మంగోలియా పర్యటనను విజయవంతంగా ముగించిన అనంతరం,తన రెండు దేశాల పర్యటనలో రెండో విడతగా జూన్ 24--25 తేదీల్లో దక్షిణ కొరియాలో రెండు రోజుల అధికారిక పర్యటనను పూర్తి చేశారు.వేగంగా మారుతున్న ప్రపంచ పరిణామాలు, భౌగోళిక-రాజకీయ (జియోపాలిటికల్) సవాళ్ల నేపథ్యంలో జరిగిన ఈ ఉన్నతస్థాయి పర్యటనను, భారత్--దక్షిణ కొరియా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే కీలక అడుగుగా భావిస్తున్నామని విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్ తెలిపారు.సియోల్ చేరుకున్న వెంటనే, విదేశాంగ మంత్రి జయశంకర్ దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో హైహూన్ తో ప్రతినిధి బృంద స్థాయి సమగ్ర చర్చలు నిర్వహించారు. దాదాపు మూడు గంటలపాటు కొనసాగిన ఈ సమావేశంలో, 2026 ఏప్రిల్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జై మైఉంగ్ భారత్ పర్యటన సందర్భంగా కుదిరిన ఒప్పందాలు, తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడంపై ప్రధానంగా చర్చించారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక రంగం, నౌకానిర్మాణం, రక్షణ,వ్యూహాత్మక దౌత్యం, సాంకేతికత మరియు స్వచ్ఛ ఇంధన (క్లీన్ ఎనర్జీ) రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని ఇరు దేశాలు సమీక్షించాయి. అలాగే స్టార్టప్‌లు, ఫిన్‌టెక్,కృత్రిమ మేధ సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలు వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో కూడా పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలనే తమ నిబద్ధతను ఇరు దేశాలు పునరుద్ఘాటించాయి.

## యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న తెలంగాణ ఉద్యమకారుడు కాకి నరసింహ ముదిరాజ్



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలు బాగా కురిసి రైతులు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆ స్వామి వారిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీలం శ్రీకాంత్, ముదిరాజ్ సిద్ర సాయిలు గండు, నరసింహ,శివ యాదవ్, స్వామివారిని దర్శించుకున్నారు.

## అంగన్‌వాడీలను బిఎల్ఓ డ్యూటీల నుండి మినహాయించాలని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారికి వినతి



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):**
సర్ నమోదు కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లను బిఎల్ఓ డ్యూటీలను విధిగా నిర్వహించాలని అధికారుల నుండి వస్తున్న ఒత్తిడీలను తగ్గించాలని నేడు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్‌ఙహెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి కరుణ కుమారి, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావనిలు రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి సి.సుదర్శన్ రెడ్డిని,అదనపు అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత సంవత్సరం మినిస్ట్రీ ఆఫ్ ఉమెన్‌ఙచైల్డ్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ నుండి రాష్ట్రాలకు లెటర్ నెం:5009-ఐసిడిఎస్-2-2024, తేది:29.03.2025న సర్క్యులర్‌ను విడుదల చేశారని వారికి తెలియజేయటం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సర్ ఎన్యుమరేషన్ కార్యక్రమంలో విధులు నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్లను పై అధికారులు ఒత్తిడి చేయటం జరుగుతుంది. దీనివల్ల అంగన్‌వాడీ సెంటర్లలలో విధి నిర్వాహణలో ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా అదే విధంగా ఆయాలు లేని సెంటర్‌లలో టీచర్లే అన్ని పనులు వారే చేయటం వలన ఈ కార్యక్రమాన్ని నిర్వహించటంలో ఎదురవుతున్న సమస్యలను తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్‌ఙహెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) దృష్టికి తీసుకురావటంతో ఆరోగ్య రిత్యా, కుటుంబ రీత్యా ఇతరాత్ర సమస్యలవల్ల ఎన్యుమరేషన్ కార్యక్రమంలో పాల్గొనలేని వారికి మినహాయింపు ఇవ్వాలని, ఎవరైతే ఈ కార్యక్రమం నిర్వహించాలని సుముఖంగా ఉంటారో వారికి మాత్రమే విధులు కేటాయించాలని ఎన్నికల అధికారులను కోరటం జరిగింది. ఎన్నికల ముఖ్య అధికారులు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

# నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం..

### అదనపు జిల్లా కలెక్టర్ డా. కిరణ్మయి..

**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్"(ఎన్ ఎంబిఏ ) కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ డా. కిరణ్మయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబాలు, సమాజం అలాగే దేశ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న "నషా ముక్త్ భారత్ అభియాన్" ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి






ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.
వ్యసన రహిత సమాజ నిర్మాణంలో ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు మరియు ప్రజలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్‌కు నషా ముక్త్ భారత్ పునాది.అని పేర్కొంటూ,ప్రతి ఒక్కరూ
మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా ఇతరులను కూడా చైతన్యపరిచి ఆరోగ్యవంతమైన, సురక్షితమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.సమాజంలో జరుగుతున్న నేరాలు, ముఖ్యంగా పిల్లలపై జరిగే అఘాయిత్యాలను అత్యంత తీవ్రంగా పరిగణించాలని ఆమె అన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద సంఘటనలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలు (డ్రగ్స్) అలాగే మద్యం (ఆల్కహాల్) అనేక నేరాలు,రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.
పిల్లలను డ్రగ్స్ అలాగే ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, "నాకెందుకులే" అనే నిర్లక్ష్య భావనకు బదులుగా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమాజం సురక్షితంగా, ఆరోగ్యకరంగా ఉంటేనే వ్యక్తులు, కుటుంబాలు కూడా సంతోషంగా ఉంటాయని తెలిపారు. అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ సహకరిస్తారని, అందరూ కలిసి పనిచేస్తేనే నేరాలు మరియు సామాజిక సమస్యలను సమర్థవంతంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.
అనంతరం అదనపు కలెక్టర్ అందరి చేత నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని నేను డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తానని డ్రగ్స్ అమ్మకం కొనుగోలు అదేవిదంగా అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి,జిల్లా సంక్షేమ శాఖ అలాగే జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, కలెక్టరేట్ ఎఓ సునీల్,సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం !

**జూన్ 25 (ప్రజావినికిడి):**
ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంక్షలు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా
ప్రపంచం యావత్తూ అతాలకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేవాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానా తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హార్మూజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడదం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని




వెళ్లేగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హార్మోజ్ తెరుచుకోవడం తో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి. అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్–ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం మరియు సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్–ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మొత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత రిఫైనరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

----------

# పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి

**ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్లో సానుకూల పరిస్థితి**

**72.28 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర**

**బంగారం ధరలు కూడా భారీగా తగ్గుతున్నట్లు అంచనా**




**న్యూఢిల్లీ,జూన్ 25 (ప్రజావినికిడి):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా–ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హర్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి. అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3996 డాలర్లకు చేరింది. వెండి ధర 57.35 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో హైదరాబాద్ విపణిలో గురువారం ఉదయం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1.44లక్షలు పలికింది. కిలో వెండి ధర రూ.2.22లక్షలకు దిగొచ్చింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.41లక్షలు (10 గ్రాములకు), వెండి ఫ్యూచర్ ధర రూ.2.13లక్షలుగా (కిలోకు) ట్రేడ్ అవుతోంది. మరోవైపు, దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కూడా గురువారం లాభాల్లో కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు.. దేశీయంగా బ్యాంకింగ్, స్థిరాస్తి రంగ సూచీల్లో కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. దీంతో ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ 511.62 పాయింట్లు పెరిగి 77,502 వద్ద, నిఫ్టీ 150 పాయింట్ల లాభంతో 24,172 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 22 పైసలు పెరిగి 94.33 వద్ద కొనసాగుతోంది.

# వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం

**సాయం అందిస్తామని ప్రకటన -సాయం కోసం సిద్దంగా ఉన్నామన్న ట్రంప్**

**న్యూఢిల్లీ,జూన్ 25 (ప్రజావినికిడి):**
వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తు సమయంలో ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం సాచాయి. వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ దేశానికి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. సహాయసహకారాలు అందిస్తామని ప్రకటించారు. వెనెజువెలా ప్రజలకు సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధంగా ఉండాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రజలను గొప్ప స్నేహితులుగా అభివర్ణించారు. ఇప్పటికే సహాయక బృందాలను మోహరించామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో వెల్లడించారు.



# ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

**బహుభార్యత్వం కూడా సమర్ధనీయమే**

**మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి ఎమ్మెల్యే సనా మాలిక్ వ్యాఖ్యలు**

**తిప్పికొట్టిన బిజెపి ఎమ్మెల్యేలు..పాక్‌కు వెళ్లాలని హితవు**

**ముంబై,జూన్ 25 (ప్రజావినికిడి):**



మహారాష్ట్ర రాజకీయాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్, ట్రిపుల్ తలాక్ అంశాలపై కొత్త వివాదం చెలరేగింది. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యే సనా మాలిక్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆమె వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు కూడా వస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే సానా మాలిక్ చేసిన ప్రకటన కలకలం రేపింది. భారత్ లో ఖురాన్ ఆధారిత చట్టాలను అమలు చేయాలని, ట్రిపుల్ తలాక్‌ను సమర్థించాలని మాలిక్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, ఖురాన్, ముస్లిం వ్యక్తిగత చట్టాలను ఉటంకిస్తూ, భారతదేశంలో ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌సీపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ లాగే, భారత్ కూడా ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను సమర్థిస్తూ సనా మాలిక్.. విడాకులలో వివిధ రూపాలు ఉన్నాయి. తలాక్–ఎ–హసన్, తలాక్–ఎ–అహ్సన్, తలాక్–ఎ–బిద్దత్ అనే మూడు రకాల విడాకులు ఉన్నాయి. ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి ఆమోదించిన చట్టం, అప్పటికే ఆచరణలో విస్తృతంగా అమలులో లేని ఒక వ్యవస్థపై ఆధారపడి ఉంది. దాని ప్రస్తావన ఎక్కడా లేదు. ఆ తర్వాత బహుభార్యత్వం గురించి మాట్లాడుతూ, బహుభార్యత్వం కేవలం ఒక మతంలోనే కాకుండా, ప్రతి మతంలోనూ ప్రబలంగా ఉంది. ముస్లింలలో బహుభార్యత్వం గురించి బోధిస్తారు. దానిని పాటించాలి. దీని కోసం ఒక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. తన వ్యాఖ్యలకు సంబంధించి సనా మాలిక్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ట్రిపుల్ తలాక్ చట్టం అమలుపై అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించానని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలకు సమానంగా వర్తించే చట్టాలు ఉండాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ అంశంపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ స్పందించారని, చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవి అన్ని మతాలకు వర్తిస్తాయని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు సనా మాలిక్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేష్ రాణెళి మాట్లాడుతూ, ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ, అసెంబ్లీలోని కొందరు ఖురాన్, ముస్లిం గ్రంథాలను ఉటంకిస్తూ యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. యూసీసీ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించారు, కానీ కొందరు తమ చట్టవిరుద్ధ చర్యలను సమర్థించుకోవలసి వచ్చినప్పుడు మాత్రమే దానిని ప్రస్తావిస్తారు. ఎవరైనా దేశ చట్టాలను, రాజ్యాంగాన్ని పాటించకూడదనుకుంటే, వారు తమ పదవికి రాజీనామా చేసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలి అని సూచించారు.

# నల్లగొండలో నలుగురి అనుమానాస్పద మృతి కేసు

**పోలీసుల అదుపులో ఆరుగురు సుపారీ హంతకులు ?**



**నల్గొండ,జూన్ 25(ప్రజావినికిడి):** జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అనుమానాస్పద మృతి కేసు కీలక మలుపు తిరిగింది. భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్(45), హసీనా(38), కుమారుడు ముజామిల్(20), కూతురు అఫోర(14)ను నిందితులు విచక్షణారహితంగా హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. సుపారీ గ్యాంగ్‌లోని ఆరుగురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్టు సమాచారం. కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలే హత్యలకు కారణంగా భావిస్తున్నారు. ఈనెల 22న హత్యలు జరగ్గా.. ఘటనాస్థలిలో ఏ ఒక్క ఆధారం లభ్యం కాకపోయినప్పటికీ పోలీసులు తీవ్రంగా శ్రమించి .. సుపారీ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పదునైన ఆయుధంతో దాడిచేసి హత్య చేసినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని పోలీసులు తెలిపారు. నగరంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగులు విక్రయించే వ్యాపారం చేస్తున్నారు. దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగి తరచూ ఇంటికి వచ్చి సుల్తాన్ గొడవ పెట్టుకునేవారని స్థానికులు చెబుతున్నారు. వీరి కుమారుడు ముజామిల్ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. హసీనా ఓ ప్రైవేటుపాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమార్తె అఫోర ఇదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సుల్తాన్ మొదటి భార్య మృతిచెందింది. హసీనాతో రెండో వివాహం కాగా ఇప్పుడున్న పిల్లలిద్దరూ సుల్తాన్ మొదటి భార్య పిల్లలని స్థానికులు చెబుతున్నారు.

# ఈపీఎఫ్ఓ సేవలు 4 రోజులు బంద్!

**జూన్ 26 నుంచి 29 వరకు ఈపీఎఫ్‌వో ఆన్‌లైన్ సేవలు నిలిపివేత**

**జూన్ 30 నుంచి సేవలు పునరుద్ధరణకు అవకాశం**

**న్యూఢిల్లీ,జూన్ 25 (ప్రజావినికిడి):**
దేశవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగులు వినియోగించే ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఆన్‌లైన్ సేవలు కొన్ని రోజుల పాటు అందుబాటులో ఉండవు. సిస్టమ్ అప్‌గ్రేడ్, డేటా మైగ్రేషన్ పనుల కారణంగా సభ్యుల పోర్టల్, యజమానుల పోర్టల్, ఉమంగ్ యాప్‌లోని పలు కీలక సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఈపీఎఫ్‌వో ప్రకటించింది.
జూన్ 26 నుంచి 29 వరకు ఈ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ కాలంలో పీఎఫ్ క్లెయిమ్‌లు దాఖలు చేయడం, క్లెయిమ్ ప్రాసెసింగ్, ఈ–పాస్‌బుక్ వీక్షించడం, కొత్త ఉద్యోగుల యూఏఎన్ లింకింగ్, ఈసీఆర్ ఫైలింగ్ వంటి సేవలు అందుబాటులో ఉండవు. సాంకేతిక మార్పుల ద్వారా మరింత వేగవంతమైన, సురక్షితమైన సేవలు అందించడమే దీని ఉద్దేశమని ఈపీఎఫ్‌వో తెలిపింది. సేవలు జూన్ 30 నుంచి తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. అయితే ఉమంగ్ యాప్‌లో కనిపిస్తున్న సమాచారం ప్రకారం కొన్ని సేవలు జులై 2 వరకు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో సభ్యులు, యజమానులు తమ అవసరాలను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించింది. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఈపీఎఫ్‌వో హెల్ప్‌లైన్ 14470ను సంప్రదించాలని సంస్థ సూచించింది.

# భారత్‌లో అమెజాన్ రూ.4లక్షల కోట్ల పెట్టుబడి

(మొదటి పేజి తరువాయి)

నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టం చేసింది. భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. దీంతో కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది. తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని కంపెనీ పేర్కొంది. ఈ సమావేశం అనంతరం ఆండీ జెస్సీ మాట్లాడుతూ.. “దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టాం. అప్పటి నుంచి ఈ–కామర్స్, ఏఐ, క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నాం. ప్రధాని మోదీ దార్శనికత అయిన ‘వికసిత్ భారత్’, ‘ఆత్మనిర్భర్ భారత్’ లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నాం. భారత్ వృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా కొనసాగుతాం” అని స్పష్టం చేశారు. ఈ కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు పైగా చేరుకుంటుంది. గత కొన్నేళ్లుగా భారత్‌లో 12 మిలియన్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేశామని, 20 బిలియన్ డాలర్ల విలువైన ఈ–కామర్స్ ఎగుమతులను సాధ్యం చేశామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చామని కంపెనీ వివరించింది. అలాగే, 10 మిలియన్ల భారతీయులకు క్లౌడ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపింది.

# వైభవ్ సూర్యవంశీకి ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్



భారత సీనియర్ క్రికెట్ జట్టులోకి దూసుకొచ్చిన 15 ఏళ్ల ఓపెనింగ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రానికి ముందే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. త్వరలో జరగబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం భారత జట్టులో చోటు దక్కించుకున్న ఈ టీనేజ్ స్టార్, బ్రిటన్ పర్యటనలో ఒక వింతైన పరిస్థితిని ఎదుర్కోబోతున్నాడు. అతను మైనర్ (చిన్నపిల్లవాడు) కావడంతో అక్కడి 'మైనర్ల రక్షణ నిబంధనల' ( ప్రకారం అతనికి పర్యటన పొడవునా ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. యునైటెడ్ కింగ్‌డమ్ క్రికెట్ నిబంధనల ప్రకారం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని 'అండర్-16' ఆటగాడిగా (మైనర్‌గా) పరిగణిస్తారు, పెద్దవాడిగా కాదు. బ్రిటన్ చట్టాల ప్రకారం మైనర్లయిన ఆటగాళ్లు వయసులో పెద్దవారైన మిగతా జట్టు సభ్యులతో కలిసి డ్రెస్సింగ్ రూమ్‌లను గానీ, షవర్ (స్నానపు) గదులను గానీ పంచుకోవడానికి వీల్లేదు. ఇది ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు యొక్క భద్రతా ఫ్రేమ్‌వర్క్‌లో ఒక భాగం. 16 ఏళ్ల లోపు ఉన్న ఆటగాళ్లు పెద్దలతో కలిసి ఒకే డ్రెస్సింగ్ రూమ్ వాడటాన్ని ఇది నిషేధిస్తుంది. స్వతంత్ర క్రికెట్ నియంత్రణ సంస్థ తో పాటు మ్యాచ్‌లు జరిగే స్టేడియాల సేఫ్‌గార్డింగ్ అధికారులు ఈ నియమాలను పర్యవేక్షిస్తారు. ఈ ఆంక్షలు ఉన్నప్పటికీ, వైభవ్ సూర్యవంశీ జట్టులోని మిగతా సభ్యులతో కలిసి టీమ్ మీటింగ్‌లు, వ్యూహాత్మక చర్చలు, వార్మ్-అప్ సెషన్లు, మ్యాచ్ రోజున జరిగే అన్ని కార్యక్రమాల్లోనూ సాధారణంగానే పాల్గొంటాడు. ఈ పరిమితులు కేవలం మ్యాచ్ దుస్తులు మార్చుకునేటప్పుడు లేదా షవర్ ఉపయోగించేటప్పుడు మాత్రమే వర్తిస్తాయి. ఆ సమయంలో అతనికి కేటాయించిన ప్రత్యేక ప్రైవేట్ గదిని ఉపయోగించాలి. ఒకవేళ ప్రధాన డ్రెస్సింగ్ రూమ్‌ను ఉపయోగించాల్సి వస్తే, మిగతా ఆటగాళ్లు ఎవరూ లేని సమయంలో నిర్దేశిత టైంలో మాత్రమే అతనికి అనుమతి ఉంటుంది. భారత్-ఇంగ్లాండ్ సిరీస్ అనేది రెండు దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కానీ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే టోర్నమెంట్ కాదు. కాబట్టి ఈ విషయంలో ఐసీసీకి ఎలాంటి అధికారం ఉండదని నివేదికలు స్పష్టం చేశాయి. "ఈ సేఫ్‌గార్డింగ్ నిబంధనలు ద్వైపాక్షిక సిరీస్‌లకు వర్తించవు. భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ సిరీస్ ఐసీసీ ఈవెంట్ కాదు కాబట్టి అండర్-16 క్రికెటర్ల కోసం ప్రత్యేక ఐసీసీ రూల్స్ ఏవీ లేవు. ఇది పూర్తిగా యూకే దేశ చట్టం, ఇందులో ఐసీసీ జోక్యం చేసుకోలేదు" అని హిందుస్థాన్ టైమ్స్ పత్రిక ఒక అధికారిక ప్రతినిధి మాటలను ఉటంకించింది. భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఇదే రకమైన నిబంధనలను పాటిస్తామని 'క్రికెట్ ఐర్లాండ్' స్పష్టం చేసింది. క్రికెట్ ఐర్లాండ్ ప్రతినిధి మాట్లాడుతూ.. "పెవిలియన్‌లో భారత జట్టు కోసం మూడు విడివిడి గదులను కేటాయించాం, అలాగే సేఫ్‌గార్డింగ్ చట్టాల గురించి వారికి వివరించాం. నిబంధనలన్నీ సక్రమంగా అమలు జరిగేలా మేము పర్యవేక్షిస్తాం, అయితే బీసీసీఐ కూడా యూకే చట్టాల ప్రకారం ఈ విషయాలను హ్యాండిల్ చేస్తుంది. మా విధానాలు బ్రిటన్ లోని ఉత్తమ పద్ధతులకు అనుగుణంగానే ఉన్నాయి" అని తెలిపారు. ఏదేమైనా ఒక అంతర్జాతీయ పర్యటనలో ఒక భారత ఆటగాడి కోసం ఇలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం క్రికెట్ చరిత్రలో చాలా అరుదైన విషయమనే చెప్పాలి.

# మెస్సీ పేరు వినగానే అసహనం!



ఫిఫా వరల్డ్ కప్ 2026లో పోర్చుగల్ స్టార్ ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డో సరికొత్త రికార్డులతో దూసుకుపోతున్నాడు. ఉజ్బెకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 5-0 తేడాతో ఘనవిజయం సాధించగా.. రొనాల్డో రెండు అద్భుతమైన గోల్స్ చేశాడు. ఈ గోల్స్‌తో ఆరు వేర్వేరు ప్రపంచకప్‌లలో గోల్స్ చేసిన ప్రపంచంలోనే ఏకైక ఆటగాడిగా క్రిస్టియానో రొనాల్డో చరిత్ర సృష్టించాడు. అంతే కాకుండా వరల్డ్ కప్‌లలో పోర్చుగల్ తరఫున అత్యధిక గోల్స్ (10) చేసిన ఆటగాడిగా కూడా రికార్డు సాధించాడు. అయితే ఈ చారిత్రాత్మక విజయం తర్వాత మీడియా సమావేశంలో చోటుచేసుకున్న ఓ సంఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్ ముగిసిన అనంతరం 'మిక్స్‌డ్ జోన్' ఇంటర్వ్యూలో క్రిస్టియానో రొనాల్డో మీడియాతో మాట్లాడుతుండగా.. ఒక స్పానిష్ జర్నలిస్ట్ అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ, కిలియన్ ఎంబాపేల గురించి ప్రశ్నించడం ప్రారంభించారు. అయితే ఆ ప్రశ్న పూర్తిగా ముగియక ముందే రొనాల్డో తీవ్ర అసహనానికి గురయ్యారు. జర్నలిస్ట్ వైపు నుంచి ముఖం తిప్పేసుకుని, పక్కనే ఉన్న మరో రిపోర్టర్ వైపు సైగ చేస్తూ తదుపరి ప్రశ్న అడగాలని కోరాడు. దీంతో సదరు రిపోర్టర్ తన ప్రశ్నను మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. నాకౌట్ రౌండ్‌లో పోర్చుగల్, అర్జెంటీనా జట్లు తలపడే అవకాశం ఉందనే అంశంపై జర్నలిస్టులు ప్రశ్నించగా.. రొనాల్డో కొంతమేర స్పందించాడు. "దీనికి ఏం సమాధానం చెప్పాలో నాకు తెలియడం లేదు. ఈ ప్రశ్నకు పెద్దగా అర్థం లేదు, కానీ ఒకవేళ ఆ మ్యాచ్ జరిగితే మాత్రం చాలా అద్భుతంగా ఉంటుంది" అని రొనాల్డో అన్నాడు. అయితే ఆ తర్వాత కూడా జర్నలిస్టులు మెస్సీ చేసిన గోల్స్ గురించి పదే పదే ప్రశ్నించడంతో రొనాల్డోకు కోపం నశాలానికి అంటింది. "నాకు ఇతరుల గురించి ఎలాంటి పట్టింపు లేదు, అక్కడ ఎంబాపే కూడా గోల్స్ చేశాడు" అని కోపంగా సమాధానమిస్తూ ఇంటర్వ్యూ మధ్యలోనే అక్కడి నుంచి వెళ్లిపోయాడు. క్రిస్టియానో రొనాల్డో, లియోనెల్ మెస్సీల మధ్య మైదానంలో ఉన్న పంతం, పోటీ ఈనాటిది కాదు. గత రెండు దశాబ్దాలుగా వీరిద్దరిలో అత్యుత్తమ ఆటగాడు ఎవరనే అంశంపై ఫుట్‌బాల్ ప్రపంచంలో నిరంతరం చర్చ జరుగుతూనే ఉంది. ముఖ్యంగా 2009 నుంచి 2018 మధ్య కాలంలో రొనాల్డో రియల్ మాడ్రిడ్‌కు, మెస్సీ బార్సిలోనా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ స్పానిష్ లీగ్ 'లా లిగా'లో ఆడినప్పుడు వీరి మధ్య పోటీ పీక్స్‌కు చేరింది. ఇప్పటికీ వీరిద్దరి అభిమానులు సామాజిక మాధ్యమాలలో ఒకరినొకరు ట్రోల్ చేసుకుంటూనే ఉంటారు. రొనాల్డో తాజా ప్రవర్తనతో మైదానం వెలుపల కూడా వీరి మధ్య ఉన్న రైవల్రీ మరోసారి స్పష్టమైంది.



## సన్‌రైజర్స్ హైదరాబాద్‌లోకి నూర్ అహ్మద్

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే ఆటగాళ్ల బదిలీల వ్యవహారం క్రికెట్ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ పదవి నుంచి తప్పుకున్న రిషబ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్తుండటం.. బదులుగా కుల్దీప్ యాదవ్ లక్నో జట్టులోకి వస్తున్నాడనే వార్తలతో ట్రేడింగ్ మార్కెట్ ఇప్పటికే వేడెక్కింది. ఈ క్రమంలోనే సీఎస్కే స్టార్ స్పిన్నర్ ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన నూర్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి ట్రేడ్ చేయబోతున్నారంటూ ఎక్స్ వేదికగా ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న సోషల్ మీడియా పోస్టుల ప్రకారం.. సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం తమ జట్టులోకి ఓ మంచి స్పిన్నర్‌ను తీసుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తోందని.. అందులో భాగంగానే సీఎస్కే స్పిన్నర్ నూర్ అహ్మద్ ప్రదర్శన పట్ల ఆరెంజ్ ఆర్మీ యాజమాన్యం ఎంతో నమ్మకంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## శతకంతో చెలరేగిన సాయి సుదర్శన్



శ్రీలంక-ఏతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్-ఏ ఓపెనర్ సాయి సుదర్శన్(175 బంతుల్లో 19 ఫోర్లతో 132) శతకంతో చెలరేగాడు. దాంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లల్లో 4 వికెట్లకు 333 పరుగులు చేసింది.సాయి సుదర్శన్‌తో పాటు కెప్టెన్ ధ్రువ్ జురెల్(138 బంతుల్లో 5 ఫోర్లతో 68 బ్యాటింగ్), తెలుగు తేజం షేక్ రషీద్(92 బంతుల్లో 4 ఫోర్లతో 53) అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు. శ్రీలంక-ఏ బౌలర్లలో సుదీర రెండు వికెట్లు తీయగా.. చామిక గుణశేఖర, రావిందు ఫెర్నాండో తలో వికెట్ తీసారు.గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు సాయి సుదర్శన్, ఆయుష్ పాండే(25) అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 82 పరుగులు జోడించారు. ఆయుష్ పాండేను తిలకరత్నే ఔట్ చేయగా.. దేవదత్ పడిక్కల్ సాయంతో సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.అయితే పడిక్కల్(12) ఎల్బీగా వెనుదిరిగాడు. ఈ పరిస్థితుల్లో రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ ఇద్దరూ ఆచితూచి ఆడటంతో పరుగుల వేగం తగ్గింది. మూడో వికెట్‌కు 85 పరుగులు జోడించిన అనంతరం రుతురాజ్ గైక్వాడ్(22) ఎల్బీగా పెవిలియన్ చేరాడు. క్రీజులోకి ధ్రువ్ జురెల్ రాగా.. సాయి సుదర్శన్ శతకం పూర్తి చేసుకున్నాడు. సెంచరీ అనంతరం సాయి సుదర్శన్‌ను గుణశేఖర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు.తెలుగు తేజం షేక్ రషీద్‌తో కలిసి ఆచితూచి ఆడిన ధ్రువ్ జురెల్ మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించాడు. ఈ ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకోవడంతో ఐదో వికెట్‌కు అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నమోదైంది.



## అక్షితా రాజ్‌తో ఆకాశ్ దీప్ వివాహం

భారత పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ ఇటీవల పెళ్లి చేసుకున్నాడు. తన పెళ్లికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. అయితే పెళ్లిక హాజరైన ఓ అతిథి రోహిత్, కోహ్లి, ధోనీని ఎందుకు పిలవలేదు అంటూ అడగ్గా.. ఆకాశ్ దీప్ చమత్కారంగా సమాధానమిచ్చాడు. వారణాసికి వాళ్లు వచ్చి ఉంటే పెళ్లి ఎవరైనా జరిగనిచ్చేవారా? అంటూ ఫన్నీగా చెప్పాడు. ప్రస్తుతం గాయాల భారిన పడ్డ ఆకాశ్ దీప్ జట్టులో చోటు కోల్పోయాడు.టీమిండియా పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ ఇటీవల వారణాసిలో అంగరంగ వైభవంగా అక్షితా రాజ్‌ను వివాహం చేసుకున్నాడు. తన పెళ్లి వేడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అభిమానులు, టీమిండియా ఫ్యాన్స్ అందరూ ఆకాశ్‌కు కామెంట్స్ రూపంలో శుభాకాంక్షలు తెలిపారు. అయితే, ఈ వివాహానికి హాజరైన ఓ అతిథి ఆకాశ్ దీప్‌ను ఓ ఆసక్తికర ప్రశ్న అడగ్గా, అంతకంటే ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చాడు ఆకాశ్ దీప్.విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీని వివాహానికి ఎందుకు ఆహ్వానించలేదంటూ ఒక అతిథిని ఆకాశ్ దీప్‌ను ప్రశ్నించాడు. దానికి ఆకాశ్ దీప్ సరదాగా స్పందిస్తూ వాళ్లు వస్తే ఇక్కడ వారణాసిలో పెళ్లి జరగనిస్తారా? అంటూ ఫన్నీగా జవాబిచ్చాడు. ధోనీ, విరాట్, రోహిత్ వంటి స్టార్ క్రికెటర్లు పెళ్లికి హాజరైతే భారీ సంఖ్యలో అభిమానులు తరలివస్తారు.. అప్పుడు పెళ్లి వేడుక ప్రశాంతంగా సాగదు కదా అన్న అర్థంలో ఆకాశ్ దీప్ చమత్కారంగా కామెంట్స్ చేశాడు. ఐపీఎల్‌లో గుర్తింపు తెచ్చుకున్న ఆకాశ్ దీప్, డొమెస్టిక్ క్రికెట్‌లోనూ రాణించి టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు.

## వన్డే ప్రపంచకప్ 2027లో రో-కో ఆడాలి

**- సెలక్టర్లకు రవిచంద్రన్ అశ్విన్ సూచన**

వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడటంపై వస్తున్న పుకార్లకు రవిచంద్రన్ అశ్విన్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. వీరిద్దరిపై పనిగట్టుకుని కొందరు నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డాడు. తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వచ్చే ప్రపంచకప్‌లో రో-కో కచ్చితంగా ఆడాలని స్పష్టం చేశాడు. అలాగే బీసీసీఐ సెలక్టర్లు కూడా వీరి భవితవ్యంపై ఇప్పుడే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే.. ఎలాంటి గందరగోళం లేకుండా వారు పూర్తి నమ్మకంతో టోర్నీకి సిద్ధమవుతారని అశ్విన్ సూచించాడు.టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ .. భవితవ్యంపై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027లో ఆడటమే లక్ష్యంగా రోహిత్, కోహ్లీ అడుగులు వేస్తున్నారు. కానీ వారు ఈ మెగా టోర్నీలో ఆడతారా.. లేదా అనే అంశంపై బీసీసీఐ ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడం లేదు. కొందరు.. రోకో ప్రపంచకప్ ఆడరని.. మరికొందరు ఆడాలని కామెంట్లు చేస్తున్నారు. ఇదే విషయంపై అశ్విన్ మాట్లాడాడు. వీరిపై సెలక్టర్లు వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించాడు.ఇటీవల కాలంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గురించి వస్తున్న వార్తలు బాలేవు. కొందరు పనిగట్టుకుని నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. అసలు ఎక్కడ నుంచి ఇలాంటి నెగెటివ్ ప్రచారం వస్తోందో తెలియడం లేదు. కొందరు మాత్రం ఈ ఇద్దరు ప్రపంచ కప్‌లో ఆడకూడదని గట్టిగా కోరుకుంటున్నారు. ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో మాత్రం అర్థం కావడంలేదు. కొందరేమో వారు ఆడకపోవచ్చని అనుమానాలు వచ్చేలా మాట్లాడుతున్నారు. మరికొందరు మాత్రం రో-కో ఉంటేనే బాగుంటుందంటారు. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్, కోహ్లీ తప్పకుండా ఆడాలి" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇదే సమయంలో అశ్విన్.. భారత సెలక్టర్లకు కీలక సూచన చేశాడు. "దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచ కప్‌లో కోహ్లీ, రోహిత్ ఉండాలని మీరు కోరుకుంటే.. ఇప్పుడే నిర్ణయం తీసుకోండి. అలా చేయడం వల్ల టోర్నీ నాటికి వారు పూర్తి సన్నద్ధతతో, విశ్వాసంతో ఉంటారు. ఒకవేళ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే.. మున్ముందు ఈ అంశం మరింత సంక్లిష్టంగా మారుతుంది. గందరగోళానికి దారి తీస్తుంది" అని రవిచంద్రన్ అశ్విన్ తన మనసులోని మాటను బయటపెట్టాడు. రోహిత్, కోహ్లీ టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. రోహిత్ ఇటీవల అఫ్ఘాన్‌తో వన్డే సిరీస్‌లో రాణించాడు. గాయం కారణంగా కోహ్లీ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ పాల్గొనే అవకాశం ఉంది.

# రోహిత్ శర్మ సక్సెస్ సీక్రెట్ ఇదే..




క్రికెట్ మైదానంలో పరుగుల వరద పారించే టీమిండియా స్టార్ ఓపెనర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బ్యాటింగ్ స్టైల్‌కు కోట్లాది మంది అభిమానులున్నారు. అయితే కఠోర శ్రమ, అద్భుతమైన ప్రతిభతో పాటు రోహిత్ సక్సెస్ వెనుక కొన్ని సీక్రెట్స్, నమ్మకాలు ఉన్నాయనే విషయం మీకు తెలుసా? ఆటగాళ్ల నమ్మకాలు.. హిట్‌మ్యాన్ సెంటిమెంట్లు..: క్రికెట్ ప్రపంచంలో ప్రతిభ ఎంత ముఖ్యమో.. అదృష్టం కూడా అంతే కీలకమని చాలామంది ఆటగాళ్ల నమ్ముతుంటారు. మైదానంలోకి అడుగుపెట్టే ముందు ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అలవాటు లేదా సెంటిమెంట్ ఉంటుంది. పూర్వకాలం నుంచి నేటి తరం ఆటగాళ్ల వరకు ఏదో ఒక నమ్మకాన్ని గుడ్డిగా అనుసరిస్తూనే ఉన్నారు. మన భారత జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఇందుకు మినహాయింపు కాదు. తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో ఎన్నో అద్భుత విజయాలు సాధించిన రోహిత్.. ప్రతి మ్యాచ్‌కు ముందు మూడు ప్రత్యేకమైన అలవాట్లను, సెంటిమెంట్లను తూచా తప్పకుండా పాటిస్తుంటారు. కాఫీ గ్లాసుతోనే రోహిత్ రోజు షురూ..: రోహిత్ శర్మ రోజువారీ జీవితంలో కాఫీకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. మ్యాచ్ ఉన్న రోజు ఉదయం నిద్ర లేవగానే హిట్‌మ్యాన్ కచ్చితంగా కాఫీ గ్లాసుతోనే తన రోజును ప్రారంభిస్తారు. ఉదయాన్నే కాఫీ తాగడం వల్ల ఆ రోజంతా తనకు ఎంతో అదృష్టం కలిసివస్తుందని రోహిత్ బలంగా నమ్ముతారు. మ్యాచ్ రోజుల్లో కాఫీ తాగడానికి ముందే టీ లేదా ఎలాంటి పండ్ల రసాలను ముట్టుకోవడానికి కూడా ఆయన ఇష్టపడరు. కేవలం వేడి వేడి కాఫీ మాత్రమే తన మానసిక స్థితిని మార్చి, మైదానంలో రాణించేలా చేస్తుందని రోహిత్ సెంటిమెంట్. భార్య రితికకు ఫోన్ కాల్.. విజయానికి అసలు మంత్రం..: మైదానంలో ఎంత ఒత్తిడి ఉన్నా.. టీమ్ మీటింగ్‌కు వెళ్లే ముందు రోహిత్ శర్మ తన భార్య రితికా సజ్దేకు కచ్చితంగా ఫోన్ చేస్తారు. రితికతో మాట్లాడటం రోహిత్‌కు మానసిక ప్రశాంతతను ఇవ్వడమే కాకుండా, మైదానంలో భారీ స్కోర్లు సాధించడానికి ఒక అదృశ్య శక్తిలా పనిచేస్తుందని ఆయన భావిస్తారు. సాధారణంగా రితికా సజ్దే ప్రతి మ్యాచ్‌లోనూ స్టేడియంలో కూర్చుని రోహిత్‌ను ప్రోత్సహిస్తూ కనిపిస్తుంటారు. అయితే మ్యాచ్ ప్రారంభానికి ముందు ఆమెతో మాట్లాడటం హిట్‌మ్యాన్ విజయ రహస్యాల్లో అత్యంత ముఖ్యమై నది. కుడికాలే ముఖ్యం.. ఒత్తిడిని జయించే రహస్యం. .: ఇక మూడవ, అత్యంత ఆసక్తికరమైన సెంటిమెంట్ ఏంటంటే.. రోహిత్ శర్మ బ్యాటింగ్ చేయడానికి మైదానంలోకి అడుగుపెట్టేటప్పుడు ఎల్లప్పుడూ తన కుడికాల్ని మొదట లోపల పెడతారు. ప్రపంచ క్రికెట్‌లో చాలా మంది దిగ్గజాలు ఈ కుడికాలి సెంటిమెం ట్‌ను పాటిస్తారు. దీనితో పాటు, మైదానంలో ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు రోహిత్ స్టేడియంలో తనకు నచ్చిన ఒక నిర్దిష్టమైన స్థలాన్ని లేదా వైపును నిరంతరం చూస్తూ ఉంటారు. అలా చూడటం వల్ల తన మనసుకు ప్రశాంతత లభిస్తుందని, ఎంతటి కఠినమైన పరిస్థితులనైనా ఎదుర్కొనే ధైర్యం వస్తుందని రోహిత్ నమ్ముతారు.

# ఓజి -2 సీక్వెల్‌కు పవన్ రెడీ

## సోషల్ మీడియాలో స్పెషల్ వీడియో విడుదల




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ' బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఓజీ 2' రానున్న విషయం ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా, తాజాగా ఆ సినిమా పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం గురువారం ఒక స్పెషల్ వీడియోను సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'గంభీర కథ సిద్ధమవుతోంది. తుపాను రావడానికి ముందు నిశ్శబ్దం ఉంటుంది' అనే పవర్‌ఫుల్ క్యాప్షన్‌తో ఈ అప్‌డేట్ ఇచ్చారు. విడుదలైన వీడియోలో డైరెక్టర్ సుజీత్‌తో కలిసి పవన్ కళ్యాణ్ స్క్రిప్ట్ గురించి చర్చిస్తున్న విజువల్స్ ఉన్నాయి. చివర్లో పవన్ కళ్యాణ్ 'నేను రెడీ' అని చెప్పడం నెటిజన్లను, మెగా అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. దీంతో 'ఓజీ 2' షూటింగ్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుందని స్పష్టమవుతోంది. మొదటి భాగానికి సంగీత దర్శకుడిగా పని చేసిన థమన్ ఎస్ ఈ సీక్వెల్‌కు కూడా మ్యూజిక్ అందించనున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. 'ఓజీ' మొదటి భాగంలో చూపించిన పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ వరల్డ్‌ను ఈ సీక్వెల్‌లో మరింత పెద్ద స్థాయిలో, కొత్త కోణంలో చూపించనున్నారని టాక్. ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్, 'ఓజీ 2' కోసం డేట్స్ కేటాయించడంతో అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.




# మామ సినిమాకు అల్లుడు క్లాప్

## బాలకృష్ణ 112వ చిత్రానికి లోకేశ్ కెమెరా ఆన్

రాజధాని అమరావతిలో నందమూరి నటసింహం బాలకృష్ణ 112వ చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. సినిమా ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరై.. క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్‌ఆన్ చేశారు. ఈ సందర్భంగా హీరో బాలకృష్ణ మాట్లాడుతూ.. సినిమా ఓపెనింగ్ కోసం వచ్చిన మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా మొదటి షాట్‌ను డైరెక్ట్ చేసిన నందమూరి తేజస్వినికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సినిమాకి క్లాప్ కొట్టి 20 సంవత్సరాలు అయ్యిందన్నారు. ఏపీలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని అన్నారు. పర్యాటక రంగం, సినీ పరిశ్రమ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని బాలయ్య తెలిపారు. సినీ ఇండస్ట్రీని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. సినిమాతో పాటు థియేటర్ ఎకనామిని ప్రోత్సహిస్తామన్నారు. ఎఐ టెక్నాలజీతో సినిమా పరిశ్రమను మరింత ఉన్నతికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సినిమాలు అమరావతి నుంచే ప్రారంభం కావాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. సినీ పరిశ్రమకు సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్టూడియోలు, రికార్డింగ్ థియేటర్లకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

# సందీప్ కిషన్ సూపర్ సుబ్బు


టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటించిన సరికొత్త వెబ్ సిరీస్ 'సూపర్ సుబ్బు'. నెట్‌ఫ్లిక్స్ సంస్థ అందిస్తున్న మొట్టమొదటి ఒరిజినల్ తెలుగు సిరీస్ ఇదే కావడం విశేషం. తాజాగా ఈ సిరీస్ అఫీషియల్ ట్రైలర్‌ను




నెట్‌ఫ్లిక్స్ ఇండియా విడుదల చేసింది. 'డీజే టిల్లు' ఫేమ్ డైరెక్టర్ మల్లిక్ రామ్ ఈ కామెడీ డ్రామా సిరీస్‌ను తెరకెక్కించారు. బాలీవుడ్ 'లిటిల్ థింగ్స్' ఫేమ్ మిథిలా పాల్కర్ ఈ సిరీస్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఒక అమాయక యువకుడు, అత్యంత సంప్రదాయ గ్రామం, అసాధ్యమైన ఓ ఉద్యోగం అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో ఈ సిరీస్ వస్తోంది. సుబ్రమణ్యం చిలుకూరి రావు అలియాస్ సుబ్బు అనే ఒక అమాయక పల్లెటూరి యువకుడికి ఎవరూ వెళ్లడానికి ఇష్టపడని 'మాకీపూర్' అనే వింత ఊరికి పోస్టింగ్ వస్తుంది. తన తండ్రి కుకటేశ్వరరావు ముందు పరువు నిలబెట్టుకోవాలని ఆ ఊరిలో అడుగుపెట్టిన సుబ్బుకి అక్కడ ఊహించని షాక్ తగులుతుంది. దేశంలోనే అత్యధిక సంతానోత్పత్తి రేటు ఉండి, జనాభా నియంత్రణ లేని ఆ ఊరి జనాలకి మనోడు సెక్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పాఠాలు చెప్పాల్సి వస్తుంది. ఒకవైపు జాబ్ టెన్షన్స్, లవ్ ప్రాబ్లమ్స్, ఇంకోవైపు ఊరి జనాల అపార్థాల మధ్య సుబ్బు పడే ఇబ్బందులు, క్రియేట్ చేసే కామెడీతో ఈ ట్రైలర్ నవ్వులు పూయించింది. మిథిలా పాల్కర్ ఒక క్రేజీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, నటి అవ్వాలని కలలుకనే పాత్రలో కనిపించనుంది. వీరితో పాటు కామెడీ కింగ్ బ్రహ్మానందం, వర్సటైల్ యాక్టర్ మురళీ శర్మ, గెటప్ శ్రీను, జీవన్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, భరత్ లక్ష్మీపతి ఈ సిరీస్‌ను నిర్మించారు. మల్లిక్ రామ్, రమేష్ ఎలిగేటి, శివాని ధోబాల్ సంయుక్తంగా దీనికి కథను అందించారు. ఈ అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్ వెబ్ సిరీస్ జులై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

# ప్రొడ్యూసర్ కి 15 కండిషన్స్ పెట్టిన యంగ్ బ్యూటీ..

టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి హీరోగా, సోషల్ మీడియా ఫోక్ సెన్సేషన్ నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న సరికొత్త చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయింది. ఈ సినిమాకు 'ఇడుపు కాయితం' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ పూజా కార్యక్రమానికి స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ గెస్ట్‌గా వచ్చి టైటిల్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. అయితే, ఈ ఈవెంట్‌లో ప్రొడ్యూసర్ బన్నీ వాస్ తన హీరోయిన్ నాగదుర్గ గురించి చెప్పిన ఒక ఇంట్రెస్టింగ్ మ్యాటర్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా ఓపెనింగ్స్ వేడుకలో నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ హీరోయిన్ నాగదుర్గ గురించి ఒక క్రేజీ సీక్రెట్ బయటపెట్టారు. "ఈ సినిమాలో హీరోయిన్‌గా చేయాలని నాగదుర్గను సంప్రదించగానే, ఆమె ఓకే చెప్పడానికి ముందు నాకు ఏకంగా 15 కండిషన్స్ పెట్టింది. ఇక ఆ రూల్స్ అన్నీ విన్నాక నేనేం అప్సెట్ అవ్వలేదు, పైగా చాలా ఆనందించాను. ఒక తెలుగు అమ్మాయి తన కెరీర్ విషయంలో, చేసే క్యారెక్టర్ విషయంలో ఎంత క్లారిటీగా ఉందో చూసి నాకు ముచ్చటేసింది. అప్పుడే నాకు అర్థమైంది.. నేను మాట్లాడుతోంది పక్కా క్లారిటీ ఉన్న ఒక తెలుగు అమ్మాయితో అని" అంటూ బన్నీ వాస్ సర్ప్రైజ్ అయ్యారు. యూట్యూబ్, సోషల్ మీడియాలో తెలంగాణ జానపద పాటలు, ప్రైవేట్ ఆల్బమ్స్ ద్వారా నాగదుర్గకు ఎంత క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఆమె చేసిన ప్రతి ఫోక్ సాంగ్ మిలియన్ల కొద్దీ వ్యూస్ రాబట్టి రికార్డులు సృష్టించింది. ఇక డాన్స్‌లో ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌ను షేక్ చేసిన నాగదుర్గ, ఇప్పుడు 'ఇడుపు కాయితం' సినిమాతో సిల్వర్ స్క్రీన్ మీద కూడా దూసుకుపోవాలని రెడీ అవుతోంది.





# కలెక్షన్లు రాబడుతున్న మా ఇంటి బంగారం

## ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లు

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ దగ్గర మంచి ప్రదర్శన కనబరుస్తుంది. విడుదలైన తొలి వారంలోనే ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూ సమంత కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, థ్రిల్లింగ్ అంశాల కలయికతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. భారతదేశంలో రూ.33.20 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదు చేయగా, దేశీయ గ్రాస్ వసూళ్లు రూ.38.36 కోట్లకు చేరుకున్నాయి. విడుదలైన ఆరో రోజున కూడా సినిమా మంచి వసూళ్లు సాధించడంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్ర జోరు కొనసాగుతోంది. విదేశీ మార్కెట్లలో కూడా ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పటివరకు ఓవర్సీస్‌లో ఈ చిత్రం రూ.17.35 కోట్ల గ్రాస్ కలెక్షన్లు నమోదు చేసినట్లు ట్రేడ్ రిపోర్టులు సూచిస్తున్నాయి. ఆరో రోజున ఒక్క రోజులోనే విదేశీ మార్కెట్ల నుంచి రూ.కోటికి పైగా వసూళ్లు రావడం విశేషం. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూకే మార్కెట్లలో సినిమాకు మంచి స్పందన లభిస్తున్నట్లు తెలుస్తోంది. చాలా కాలం తర్వాత సమంత ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమా యాక్షన్, ఫ్యామిలీ, థ్రిల్లర్ అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సినిమాలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, శ్రీముఖి, శ్రీలక్ష్మి, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుషా తదితరులు కీలక పాత్రల్లో నటించారు.





# వెండితెరపైకి వస్తోన్న మిర్జాపూర్

అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు 'మిర్జాపూర్: ది మూవీ' పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు. రెండు నిమిషాల కంటే ఎక్కువ నిడివి ఉన్న ఈ టీజర్ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, మరింత భారీ యాక్షన్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగింది. ఈ సారి కేవలం మిర్జాపూర్ గద్దె కోసమే కాకుండా అధికారం కోసం కూడా యుద్ధం జరగబోతోందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కేవలం హిందీలోనే కాకుండా ఇతర భాషలో కూడా థియేటర్లలో విడుదలరాబోతున్నట్లు తెలుస్తుంది.

# నా బాడీ నాష్టం అంటే..వాడి కళ్లు వాడి ఇష్టం

## స్త్రీల వేషధారణపై పరిమితులు ఉండాలన్న సునీత




ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ సునీత ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మహిళల వస్త్రధారణ, సినిమా సామాజిక బాధ్యత, మరియు సమాజంలో స్వేచ్ఛ అనే అంశాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చకు దారితీశాయి. సమాజంలో జరిగే విషయాలనే సినిమాలో చూపిస్తున్నామని మేకర్స్ చెప్పే సమాధానాన్ని సునీత తప్పుబట్టారు. కమర్షియల్ సినిమా అయినా, ఎలాంటి సినిమా అయినా సమాజం పట్ల కొంత బాధ్యత కలిగి ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే సమాజంలో సినిమాని తిడితే, సినిమాలో సమాజాన్ని తిడుతున్నారు, సమాజం అలా ఉంది కాబట్టే తాము ఇలా సినిమా తీశామని మేకర్స్ చెబుతున్నారని సునీత పేర్కొన్నారు. ఇక ఇటీవల కాలంలో బాగా వినిపిస్తున్న మై బాడీ మై రైట్ అనే స్లోగన్‌పై సునీత ప్రాక్టికల్ కోణంలో మాట్లాడారు. అమ్మాయిలు నా బాడీ నా ఇష్టం అని తమకు నచ్చిన బట్టలు వేసుకున్నప్పుడు, అవతలి వ్యక్తి చూసే చూపును కూడా వాడి కళ్ళు వాడి ఇష్టం అనాల్సి వస్తుందని, ఇందులో ఎవరినీ తప్పు పట్టలేమని అన్నారు. ఎవరి ఇష్టం వారిదని ఆమె స్పష్టం చేశారు. అయితే బట్టల పరిధిని పెంచుకోవడాన్ని లేదా తగ్గించుకోవడాన్ని తన దృష్టిలో అసలైన స్వేచ్ఛ అనరని సునీత తెలిపారు. చుట్టూ ఉన్న పరిసరాలు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయో చూసుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. కేవలం బట్టలు లేదా సిగరెట్లు తాగడం ఈక్వాలిటీ కాదని, సమాజంలో లేదా ఒక ఇంట్లో ఒక మహిళ తన అభిప్రాయాన్ని చెప్తే, దానికి పురుషులు ఎంతవరకు విలువ ఇస్తున్నారు అనే దానిపై పోరాడాలని సునీత అభిప్రాయపడ్డారు. పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై కూడా సునీత పరోక్షంగా ప్రస్తావిస్తూ ఎవరి ఒపీనియన్ వాళ్లది. ఎస్ చెప్పాలన్నా, నో చెప్పాలన్నా మన ఇష్టమే. కేవలం సినిమా ఇండస్ట్రీలోనే కాదు, నేను జనరల్ గా సొసైటీలో ఉన్న అమ్మాయిల గురించి కూడా మాట్లాడుతున్నాను. ఇక్కడ ఒక గీత గీయాలంటే, ఫుల్ స్టాప్ పెట్టాలంటే బలవంతం ఏమీ లేదు అని సునీత తెలిపారు.

-------------

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613